ప్రజాశక్తి

సోమవారం 30 సెప్టెంబర్ 2024 | 8 పేజీలు





ఎన్‌టిఆర్ | కృష్ణా

పరిహారమేదీ..?



వీరులపాడులో నీటి మునిగిన పత్తి, వత్సవాయిలో ఇసుక మేట వేసిన పొలం (ఫైల్)

- ఎన్‌టిఆర్ జిల్లాలో లక్ష ఎకరాల్లో పంట నష్టం
- మొక్కుబడి సాయంతో సరిపుచ్చుతున్న ప్రభుత్వం
- తిరిగి పంటల సాగుకు సాయం కోసం రైతు ఎదురుచూపులు
- ప్రభుత్వ రుణ సాయం ప్రకటనలకే పరిమితం

ప్రజాశక్తి-విజయవాడ

ఇటీవల వచ్చిన వరదలకు సర్వం కోల్పోయిన ఎన్‌టిఆర్ జిల్లా రైతులు పరిహారం కోసం ఎదురుచూస్తున్నారు. పారదర్శకంగా దెబ్బతిన్న పంటల ఎన్యుమరేషన్ జరగకపోగా, జరిగిన దానికి కూడా నేటికీ డబ్బులు అందక రైతులు అవస్థలు పడుతున్నారు. తిరిగి పంటల సాగుకు రుణాలు, విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు కోసం రైతులు ఎదురుచూడాల్సి వస్తోంది. అటు ఇళ్లు, ఇటు పంటలు, వ్యవసాయ భూములు, వివిధ రూపాల్లో సర్వం కోల్పోయిన రైతులకు కంటితుడుపు చర్యలతో ప్రభుత్వం సాయం అందజేస్తూ వచ్చింది. వ్యవసాయ పంటలు దగ్గర నుంచి వాణిజ్య పంటలు, వ్యవసాయ భూముల్లో పెద్ద ఎత్తున ఇసుక మేట వేయడం, భూమి కోతకు గురికావడం, చెరువుల్లాగా దర్శనమివ్వడం, పలు చెరువులకు గండ్లు పడటం, లిఫ్ట్ ఇరిగేషన్లు, వ్యవసాయ పంపుసెట్లు, ట్రాన్స్‌ఫారమ్స్, స్తంభాలు దెబ్బతినడం వంటి పలు రూపాల్లో రైతులకు కోలుకోలేని నష్టం కలిగింది. మరలా వ్యవసాయం చేసుకునేందుకు చేతిలో చిల్లిగవ్వ లేక, అప్పులు కోసం ఎదురుచూస్తున్న తరుణంలో అటు పరిహారం చెల్లించడంలోనూ, ఇటు రుణ సదుపాయం కల్పించడంలోనూ ప్రభుత్వం ప్రకటనలకే పరిమితం అవుతుందని రైతులు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు.

ఎన్‌టిఆర్ జిల్లాలో రూ.75 కోట్లు నష్టం

ఎన్‌టిఆర్ జిల్లాలో వరదలకు రైతులు వివిధ రూపాల్లో రూ.75 కోట్లకు పైగా నష్టపోయారు. ఇదే విషయాన్ని (మిగతా 2లో)

దసరా ఉత్సవాల విజయవంతానికి చర్యలు

కలెక్టర్ డాక్టర్ సృజన, సిపి రాజశేఖరబాబు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనే లక్షలాది మంది యాత్రికులకు మెరుగైన సేవలందించేలా, ఉత్సవాలు విజయవంతం అయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.సృజన, పోలీస్ కమిషనర్ ఎస్‌వి రాజశేఖరబాబు చెప్పారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతం అయ్యేలా ఆదివారం డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ గౌతమిశాలి, దుర్గగుడి ఇఒ కెఎస్ రామరావు తదితరులతో కలిసి పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, పోలీస్, దేవాదాయ అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని యాత్రికులు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా త్వరగా అమ్మవారి దర్శనం జరిపించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇప్పటికే దసరా ఉత్సవాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. యాత్రికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని క్యూలైన్లు, స్నాన ఘట్టాలు, (మిగతా 2లో)



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన, సిపి రాజశేఖరబాబు

జాబ్‌మేళాల ద్వారా యువతకు ఉద్యోగాలు

- పాఠశాల, కళాశాల విద్యార్థులకు కెరీర్ గైడెన్స్
- కృష్ణాజిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి విక్టర్‌బాబు



ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనకు జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి దేవరపల్లి విక్టర్‌బాబు (ఎఫ్ఎసి) తెలిపారు. ఇతర ప్రభుత్వ శాఖలతోనూ సమన్వయం చేసుకుని యువతకు ఉద్యోగ కల్పనకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. పాఠశాల స్థాయిలో 10వ తరగతి, కళాశాల స్థాయిలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదివే విద్యార్థులతో కెరీర్ టాక్స్ నిర్వహిస్తున్నామని, కెరీర్ గైడెన్స్ అందిస్తున్నామని తెలిపారు. ఉపాధి కల్పన సంస్థ ద్వారా యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనకు జరుగుతున్న కృషిని విక్టర్‌బాబు ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు.



ప్రశ్న: ఉపాధి కోసం దరఖాస్తులు ఎన్ని వచ్చాయి ?

జవాబు: నిరుద్యోగ యువత ఉపాధి కల్పనకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఈ ఏడాది 2024 అగస్టు నెలాఖరు వరకు 21, 542 మంది యువత ఆన్‌లైన్‌లో ప్రస్తుతం రిజిస్టర్ చేసుకున్నారు. పురుషులు 13,983 మంది ఉన్నారు. మహిళలు 7, 559 మంది ఉన్నారు. ఎస్‌సి 6,364, ఎస్‌టి 1,516, బిసిలు 7, 615 మంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న వారిలో శారీరక వికలాంగులు 6,628 మంది, అంధులు 898 మంది, చెవుడు, మూగ 950 మంది ఉన్నారు.

ప్రశ్న: ఈ ఏడాది జాబ్ మేళాలు ద్వారా ఎందరికి ఉద్యోగాలు వచ్చాయి?

జవాబు:జనవరి నెలలో మూడు, ఫిబ్రవరిలో రెండు, మార్చిలో ఒకటి, జూన్‌లో మూడు, జులైలో నాలుగు, అగస్టులో ఐదు చొప్పున మొత్తం 18 జాబ్ మేళాలు నిర్వహించాము. ఏప్రిల్, మే నెలల్లో ఎన్నికల కోడ్ (మిగతా 2లో)

వరద బాధితుల సమస్యలపై సమీక్షించాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబూరావు

ప్రజాశక్తి-విజయవాడ: రాష్ట్ర ప్రభుత్వం అన్ని రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాలు, బాధితులతో అఖిలపక్ష సమావేశం నిర్వహించి వరద సహాయం, విధివిధానాల్లో మార్పులు చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు కోరారు. వరద ప్రభావిత అజిత్ సింగ్‌నగర్, న్యూ రాజరాజేశ్వరిపేట తదితర ప్రాంతాల్లో సిపిఎం నేతలు ఆదివారం పర్యటించారు. వరద బాధితులు ఎదుర్కొంటున్న అనేక విషయాలను వారు బాబూరావు దృష్టికి తీసుకొచ్చారు. స్థానిక శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు తమను పట్టించుకోవటంలేదని బాధితులు తెలిపారు. అలాగే వరదలో మృతిచెందిన ముఠా కార్మికుడు పోలినాయుడు కుటుంబాన్ని నాయకులు పరామర్శించారు. 29 రోజులు గడిచినా మృతిచెందిన కుటుంబానికి ఇవ్వాల్సిన ఐదు లక్షల రూపాయల సహాయం అందలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. రోజులు గడుస్తున్నా, కంపెనీలలో ఆటో రిపేర్లు కావడం లేదని కార్మికులు తెలిపారు. ఇన్సూరెన్స్ కంపెనీల వైఖరితో న్యాయం జరగటం లేదని, తాత్కాలిక రిపేర్లతోనే సరి పెట్టుకోవాల్సి వస్తోందని, ప్రభుత్వ సహాయం కొందరికే వచ్చిందని, పది వేల రూపాయల సహాయం ఏ మూలకు చాలదని ఆటో (మిగతా 2లో)



ఆటో కార్మికులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు బాబూరావు

మొదటిపేజీ తరువాయి

జాబ్‌మేళాల ద్వారా యువతకు ఉద్యోగాలు

కారణంగా జాబ్ మేళాలు జరగలేదు. 127 కంపెనీలు పాల్గొన్నాయి. 2,257 మంది యువత హాజరయ్యారు. 396 మంది ఉద్యోగాలు సాధించారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఎపిఎస్‌డిసి), డిఆర్‌డిఎ, సిడాప్‌లతో సమన్వయం చేసుకుని ఉపాధి కల్పన సంస్థ ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తోంది. అక్టోబర్ నుంచి ప్రతి నెలా ఏడు జాబ్ మేళాలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించాం. జాబ్ మేళాలతో పాటు పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులతో కెరీర్ టాక్ నిర్వహిస్తున్నాం. ఉద్యోగ అవకాశాలపై కెరీర్ గైడెన్స్ అందిస్తున్నాం.

ప్రశ్న: విద్యార్థులకు కెరీర్ టాక్ ఎలా నిర్వహిస్తున్నారు?

జవాబు: పాఠశాలల్లో పదో తరగతి, కళాశాలల్లో ఫైనల్ ఇయర్ వరకు చదివే విద్యార్థుల వరకు కెరీర్ టాక్ నిర్వహిస్తున్నాం. స్కూళ్లు, కాలేజీలకు వెళ్లి విద్యార్థులు చదువు తర్వాత ఎలా స్థిరపడాలనుకుంటున్నారో అడిగి తెలుసుకుంటున్నాం. సాధించదలిచిన లక్ష్యాలు, ఆసక్తి చూపుతున్న ఉద్యోగాలు, రంగాల గురించి అడిగి తెలుసుకుంటున్నాం. భవిష్యత్ బాగుండాలంటే ఎటువంటి నైపుణ్యాలు సాధించాలో కెరీర్ గైడెన్స్ అందిస్తున్నాం.

ప్రశ్న: జాబ్ మేళాల్లో ఏ తరహా కంపెనీలు ఉద్యోగ నియమకాలు చేపట్టాయి?

జవాబు: వరుణ్ మోటర్స్, టెక్నో టాస్క్ బిజినెస్ సర్వీసెస్, శ్రీ సుధీర్ టింబర్ డిపో, హెట్రో ల్యాబ్స్ (హైదరాబాద్), పేటీఎం సర్వీసెస్, మెడ్ ప్లస్ తదితర సంస్థలు జాబ్ మేళాలో పాల్గొన్నాయి. కంప్యూటర్ ఆపరేటర్లు, సేల్స్ ఎగ్జిక్యూటివ్‌లు, టెలీ కాలింగ్, సెక్యూరిటీ గార్డు, సూపర్ వైజర్, ఫార్మసీ ఉద్యోగాలు కల్పించాయి. ఐటిఐ ఫిట్టర్, పాలిటెక్నిక్, డిగ్రీ, బిఎస్‌సి, ఎంఎస్‌సి కెమిస్ట్రీ, బి ఫార్మసీ చదివిన వారిని కంపెనీలు నియమించుకున్నాయి.

ప్రశ్న: ఉద్యోగానికి ప్యాకేజీ ఎంత ఇస్తున్నాయి?

జవాబు: యువతలోని నైపుణ్యాలు, ఆయా రంగాల్లో ఉన్న అనుభవం ఆధారంగా ప్యాకేజీలు అందిస్తున్నాయి. నెలకు రూ. 12 వేల నుంచి రూ. 25 వేల వరకు నెలవారీ వేతనం ఇస్తున్నాయి. జాబ్‌లో చేరిన తర్వాత సీనియారిటీ, నైపుణ్యం ఆధారంగా జీతాలు పెరుగుతాయి.

వరద బాధితుల సమస్యలపై సమీక్షించాలి

కార్మికులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా బాబూరావు మట్లాడుతూ ముఖ్యమంత్రి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వరద బాధితుల సమస్యలపై ప్రత్యేకంగా సమీక్ష చేయాలన్నారు. అన్ని వర్గాలకు ప్రకటించిన సహాయం రెట్టింపు చేయాలని, ఇప్పటివరకు మినహాయించబడిన వివిధ తరగతులకు సహాయంపై ప్రభుత్వం విధానపరంగా నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు. దెబ్బతిన్న ఇళ్ల రిపేర్లు కొరకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలన్నారు. వరదల్లో దెబ్బతిన్న అన్ని రకాల వాహనాలకు సహాయం ఇవ్వాలన్నారు. చిన్న, మధ్యతరగతి ఇతర వ్యాపారులు, సంస్థలు, పరిశ్రమలకు జరిగిన నష్టానికి అనుగుణంగా సహాయం అందించాలన్నారు. ఆటోలు ఇతర వాహనాలు సహాయం, ఇన్సూరెన్స్, రిపేర్లు తదితర అంశాల్లో వస్తున్న ఇబ్బందులను పరిష్కరించాలన్నారు. తక్షణ సహాయంతో పాటు వరద బాధితులు కోలుకునే వరకు ప్రభుత్వ శాఖలు, యంత్రాంగం పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాలన్నారు. వరద పోయి 29 రోజులు గడుస్తున్నా కేంద్ర ప్రభుత్వం వరద సహాయం ఎందుకు అందించదని ప్రశ్నించారు. కేంద్ర సహాయంపై రాష్ట్ర ప్రభుత్వం మౌనం వహించడం తగదన్నారు. వరదలతో జిల్లాలోనూ, రాష్ట్రంలోనూ లక్షలాది కుటుంబాలు సర్వస్వం కోల్పోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఉదారంగా బాధితులను ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు బాధితులను గుర్తించడంలో పెట్టిన నిబంధనలు లోపభూయిష్టంగా ఉన్నాయన్నారు. స్థానిక పరిస్థితులపై అవగాహన లేకుండా అధికారులు, బృందాలు చేసిన ఎన్యుమరేషన్ తప్పుల తడకగా సాగిందన్నారు. జరిగిన లోపాలను యంత్రాంగం, ప్రభుత్వం గుర్తించకుండా సమర్థించుకోవడం సరికాదన్నారు. నెల రోజుల తర్వాత కూడా బాధితులకు సరైన సహాయం అందకపోవటం గర్హనీయమన్నారు. మళ్లీ ప్రజాప్రతినిధులు, మంత్రులు, అధికారులు పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించి బాధితులు అందరికీ న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు బి.రమణారావు, టి శ్రీనివాస్, రాము, రాజులమ్మ తదితరులు పాల్గొన్నారు.



శ్రీ భ్రమర 'శ్రీ సిటీ' ప్రారంభం

విజయవాడ: మూస పద్ధతిలో కొనసాగుతున్న రియల్ ఎస్టేట్ వ్యాపారంలో సమూలమైన మార్పులు చేపట్టి, వినూత్న ఆలోచనలతో, అద్భుతమైన వెంచర్లతో గృహ నిర్మాణ రంగంలో అద్భుతాలు సృష్టిస్తున్న శ్రీ భ్రమర టౌన్షిప్స్ ప్రైవేట్ లిమిటెడ్ 'శ్రీ సిటీ' పేరుతో మార్కాపురం పట్టణంలో ఒక అద్భుతమైన ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. మార్కాపురానికి మణిహారంగా నిలిచే 'శ్రీ సిటీ' ప్రారంభ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. శ్రీ భ్రమర హౌసింగ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ గళ్లా రామచంద్రరావు వెంచర్‌ను ప్రారంభించగా, ముఖ్య అతిథులుగా మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, అడుసుమల్లి కిషోర్ బాబు, చెంచు గరటయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్న నేటి సమాజానికి విలాసవంతమైన జీవన శైలిని అందించడానికి 'శ్రీ సిటీ' ప్రారంభించినట్లు చెప్పారు. ఈ వెంచర్‌లో విల్లా ప్లాట్స్, కమర్షియల్ ప్లాట్స్, సింప్లెక్స్ హౌసెస్, డూప్లెక్స్ హౌసెస్, విల్లాస్ లభిస్తాయన్నారు. గ్రాండ్ ఎంట్రన్స్ ఆర్చ్, సోలార్ ఫెన్సింగ్‌తో కాంపౌండ్ వాల్, సెంట్రల్ మీడియన్, డిజైనర్ ల్యాండ్ స్కేప్‌తో విశాలమైన రోడ్లు, కిడ్స్ పార్కులు, వాకింగ్ ట్రాక్లలు, థీమ్ పార్కులు, ఓవర్ హెడ్ ట్యాంకుతో ప్రతి ప్లాట్‌కి వాటర్ పైప్ లైన్ కనెక్షన్ వంటి ఎన్నో అత్యాధునిక సౌకర్యాలతో 'శ్రీ సిటీ'ని తీర్చిదిద్దామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు మారం చంద్రశేఖర్, ఎం.ఎస్ రాజు, ఎం.పి.కె లక్ష్మీపతి రాజు, శైలారెడ్డి కోట, ర్రయడ్లపల్లి మురళీకృష్ణ, రావెల గోపాలకృష్ణ, చెన్నంశెట్టి సతీష్‌బాబు, కల్వకోట సాయిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమలో ట్రాఫిక్ ఇక్కట్లు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యతో ప్రజలు అనేక ఇక్కట్లకు గురవుతున్నామంటూ వాపోతున్నారు. వివరాల్లోకి వెళ్తే పశ్చిమంలో నిత్యం రద్దీగా ఉండే వన్‌టౌన్ రథం సెంటర్, దుర్గగుడి పరిసర ప్రాంతాలు, కాళేశ్వరరావు మార్కెట్, వస్త్రలత సెంటర్, బ్రాహ్మణ వీధి, నెహ్రూ బొమ్మ సెంటర్, చిట్టినగర్, పంజా సెంటర్. సితార సెంటర్‌తో పాటు విద్యాధరపురం కుమ్మరిపాలెం రోడ్డు, భవానీపురం చర్చి సెంటర్, స్వాతి రోడ్లు ట్రాఫిక్ కోరల్లో చిక్కుకుంటున్నాయి. కారణమేమంటే ప్రధాన రహదారులైన ఈ ప్రాంతాలలో బడ్డీకొట్లు, టిఫిన్ బండు, ఇతర వ్యాపారులు రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తుండటంతో టిఫిన్ బండ్ల వద్దకు వచ్చే ఆటోవాలాలు, ద్విచక్ర వాహనదారులు రోడ్లపేనే వాహనాలు నిలపటంతో పాదచారులు, మహిళలు, పాఠశాలలకు వెళ్లు పిల్లలు నానా ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. అంతేగాక రోజురోజుకు ట్రాఫిక్ అస్తవ్యస్తంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీనికితోడు ట్రాఫిక్ జామ్ కూడా కావటంతో మరింత ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు కూడా వాపోతున్నారు. ట్రాఫిక్ పోలీసులు ఈ ప్రాంతాలలో దృష్టి సారించకపోవటంతో రోడ్లపై వ్యాపారాలు నిర్వహించేవారు వాహనదారులు, ప్రజలతో గొడవకు కూడా దిగుతున్నారని అంటున్నారు. ఈ ప్రాంతాలలో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో కనీసం ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించిన పరిస్థితి కనబడటం లేదని చెబుతున్నారు. మరికొద్ది రోజుల్లో దుర్గగుడి దసరా ఉత్సవాల నేపథ్యంలో పశ్చిమ ప్రాంతమంతా మరింత ట్రాఫిక్ మయంగా మారటమే గాక, భక్తులతో రోడ్లు కిక్కిరిసిపోతాయి. కనుక సంబందిత వన్‌టౌన్, భవానీపురం ట్రాఫిక్ సిఐలు పక్క ప్రణాళికలతో ఈ ప్రాంతాలలో రోడ్లపై ఆక్రమణలు లేకుండా ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేఉకండా తగు చర్యలు తీసుకోవాలని నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబుకు పశ్చిమ ప్రాంత వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అమ్మో...అరటిపండు..!

- **వరదల దెబ్బకు ధర పైపైకి**

ప్రజాశక్తి-గన్నవరం: ఆ మాటెత్తితే సామాన్యుడు ఉలిక్కిపడుతున్నాడు. మొన్నటివరకు సామాన్యుడి అందుబాటులో ఉన్న అరటి ధర నేడు చుక్కలనంటుతోంది. పెళ్లిళ్ల, ఇతర శుభ కార్యాలు, పూజల్లో అరటి పండు ప్రధానపాత్ర వహిస్తోంది. విందు భోజనాల్లో ఎన్ని రకాలు వడ్డించినా చివరగా అరటిపండు లేకపోతే తప్తిగా ఉండదంటారు. అలాంటి పండు ధర క్రమంగా 15 రోజులుగా కొండెక్కి కూర్చొంది. డజన్ రూ. 40గా ఉన్న పండ్లు నేడు రూ. 80 లకు పైగా అమ్ముతున్నారు. కాస్త పెద్ద సైజు పండైతే రూ. 100 వెచ్చించాల్సి వస్తోంది. ప్రస్తుతం వివాహ శుభకార్యాలు పెద్దగా లేకపోయినా అరటిపండ్ల ధరలు పెరుగుతున్నాయి. వరదల్లో తోటలు పోవడంతో ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. రానున్న రోజుల్లో మరింత ప్రియం అయ్యే అవకాశం ఉంది. చక్కెర కెళ్ళి డజను 150 రూపాయల నుంచి 200 వరకు అమ్ముతున్నారు. అయితే రైతులకు మాత్రం ఈ రేటు అందకపోవడం గమనార్హం.

ధర 'పండు'తోంది

ఆగస్టు వరకు డజన్ రూ.40గా ఇంటింటికి తిరిగిన అరటిపండ్ల వ్యాపారులు సెప్టెంబర్ నుంచి క్రమంగా కనుమరుగయ్యారు. కేవలం గన్నవరంలోనే 40కు పైగా ఉన్న అరటిపండ్లు విక్రయించే బండ్లు నేడు నాలుగో శాతానికి పడిపోయాయి. ముఖ్యంగా కూడళ్లలో అరటి పండ్ల వ్యాపారాలే అధికంగా కనిపించేవి. ప్రస్తుతం బండ్లు కిక్కిరేసి ఉండే బస్టాండు లాంటి ప్రాంతంలో కూడా నాలుగైదుకు మించి అరటిపండ్ల బండ్లు కనిపించడం లేదు. కొనుగోలుదారుడు తప్పనిసరి వెళిన



కూడా తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్లినా కూడా పండ్లలో నాణ్యత కనిపించదు. ఇంతకుమించి మంచి సరుకు రావడం లేదని, అసలు తోటల నుంచి దిగుబడి పూర్తిగా తగ్గిపోయిందని, ఒకటి, రెండు మినహా సాగు, తోటలు తగ్గాయని విక్రయదారుడు పేర్కొంటున్నారు. గతంలో అరటిపండ్ల ధర ఇంత లేదని, ఇప్పుడు ఒక్కసారిగా రూ. 100లుగా తిష్ట వేసుకుని కూర్చొవడం తమకు కూడా ఇబ్బందిగా ఉందని, రోజూ 200- 400 డజన్ల పండ్లు అమ్మే తాము ఇప్పుడు 25 డజన్లు కూడా అమ్మలేక పోతున్నట్లు వ్యాపారులు తెలిపారు.

పరిహారమేదీ..?

బాధిత రైతులతో పాటు రైతు సంఘాలు జిల్లా కలెక్టర్‌కు, జిల్లా వ్యవసాయాధికారులకు వినతిపత్రాల రూపంలో తెలియజేశాయి. ఆ మేరకు సాయం చేసి రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరాయి. అయితే రైతులకు జరిగిన నష్టాన్ని తక్కువ చేసి జిల్లా వ్యవసాయాధికారులు నివేదికలు తయారు చేశారు. వరదలకు రూ.58 కోట్ల మేర రైతులు నష్టపోయినట్లు అంచనా వేశామని, ఆ మేరకు చెక్కుల రూపంలో బాధిత రైతులకు అందజేస్తున్నామని వ్యవసాయాధికారులు వివరిస్తున్నారు.

లక్ష ఎకరాలకు పైగా పంట నష్టం

బుడమేరు, కృష్ణానది వరదలతో పాటు ఖమ్మం, ఇతర ప్రాంతాల నుంచి ఎన్‌టిఆర్ జిల్లాలోకి ప్రవహిస్తున్న మున్నేరు, కట్టలేరు, ఇతర వాగులు, వంకల వరద ముంపునకు సుమారు లక్ష ఎకరాల్లోని వ్యవసాయ పంటలతో పాటు ఇతర వాణిజ్య పంటలు పూర్తిగా దెబ్బతిన్నట్లు బాధిత రైతులు, రైతు సంఘాలు, కౌలురైతు సంఘాల సర్వేలు విధితం చేస్తున్నాయి. అయితే సుమారు 60 వేల ఎకరాల్లో మాత్రమే వ్యవసాయ పంటలు దెబ్బతిన్నట్లు జిల్లా వ్యవసాయాధికారులు వివరిస్తున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 2,43,350 ఎకరాల్లో వివిధ రకాల పంటల సాగు చేయాల్సి ఉండగా, నేటికి 2,09,892 ఎకరాల్లో రైతులు వివిధ రకాల పంటల సాగు చేశారు. వరి, పత్తి, పెసలు, మినుము, మొక్కజొన్న, శనగ తదితర పంటలు వేశారు. వేసిన పంటల్లో దాదాపుగా సగం విస్తీర్ణంలోని పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. 30 వేల మందికి పైగా రైతులు పంటల రూపంలోనే సుమారు రూ.70 కోట్ల వరకు నష్టపోయినట్లు ఒక అంచనా. జగ్గయ్యపేట మండలంలో దెబ్బతిన్న వరి పంట స్థానంలో మరలా సాగుచేసుకుంటున్నారు. అలాగే మొక్కజొన్న మరలా దుక్కి దున్ని సాగు చేసే పనిలో రైతులున్నారు. శనగా కూడా సాగు చేస్తున్నారు. దెబ్బతిన్న పంటల స్థానంలో మరలా దుక్కిదున్ని సాగు చేసుకోవడానికి రైతులు అప్పులపై ఆధారపడాల్సి వస్తోందని ఆందోళన చెందుతున్నారు.

మరమ్మతులకు నోచుకోని మోటార్లు

వరదలకు వ్యవసాయ మోటార్లు పూర్తిగా దెబ్బతిన్నా కానీ వాటి మరమ్మతులకు రైతులు పెద్దఎత్తున ఖర్చు చేయాల్సి వస్తోందని రైతులు లబోదిబోమంటున్నారు. 6,900 మోటార్లు వరద నీళ్లల్లో కొట్టుకుపోయాయి. అలాగే దెబ్బతిన్న 15 ట్రాన్స్‌ఫారమ్స్, 12 లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్స్ నేటికీ మరమ్మతులకు నోచుకోలేదు. జగ్గయ్యపేట, చందర్లపాడు, ఇతర మండలాల్లోని గ్రామాల్లో పెద్ద ఎత్తున దెబ్బతిన్న చెరువులకు నేటికీ గండ్లు పూడ్చకపోగా, కట్టలు పటిష్టపరచలేదు. వరదలకు వీటి పరిధిలోని వేలాది ఎకరాలు పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. గత టిడిపి ప్రభుత్వం కాలంలో నీరు-చెట్టు కింద చెరువుల్లో మట్టి తోలినా వాటి కట్టలు పటిష్టపరచలేదు. తద్వారా ఈ వరదలకు పూర్తిగా దెబ్బతిని వేలాది ఎకరాల పంటలు మునిగాయని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతులను ఆదుకోవాలి : రైతు సంఘం

నష్టపోయిన రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి పివి ఆంజనేయులు, కౌలురైతు సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. అత్యధిక మంది కౌలు రైతులు పలురూపాల్లో నష్టపోయారన్నారు. మరలా పంటలు సాగు చేసుకునేందుకు బ్యాంకులు విరివిగా పంట రుణాలు మంజూరు చేయాలని కోరుతున్నారు.

దసరా ఉత్సవాల విజయవంతానికి చర్యలు

మరుగుదొడ్ల ఏర్పాటుతో పాటు నిరంతరం తాగునీటి సరఫరా, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు క్యూలైన్లలో వేచి ఉండే యాత్రికులకు అమ్మవారి దర్శనం త్వరగా అయ్యేలా చర్యలు తీసుకున్నామన్నారు. యాత్రికుల దాహార్తిని తీర్చడానికి 27 ప్రాంతాలలో తాగునీటి బాటిల్స్ సరఫరా చేసేందుకు మూడు షిఫ్టుల్లో సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు. భక్తుల సౌకర్యార్థం లగేజీ, చెప్పులు భద్రపరుచుకునేందుకు 30 క్లాక్ రూములను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసే వీఐపీ, వీవీఐపీలు, ప్రజాప్రతినిధులు కోసం ప్రత్యేక సమయాన్ని కేటాయించి వారికి దర్శనం కల్పించి సామాన్య యాత్రికులకు ఇబ్బంది కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. సిపి రాజశేఖరబాబు మాట్లాడుతూ యాత్రికుల మనోభావాలు దెబ్బతినకుండా వాస్తవ సమాచారాన్ని అందించి దసరా ఉత్సవాల విజయవంతంలో సహకరించాలని మీడియా ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో డీసీపీలు ఏబీటీఎస్ ఉదయరాణి, ఎం.కృష్ణమూర్తి నాయుడు, అడిషనల్ డీసీపీ జి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాపాక ఏకాంబరాచార్యులు స్మారక పురస్కార ప్రదానం

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : స్థానిక విరాట్ విశ్వకర్మ భవన్‌లో ఆంధ్ర ప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సాహితీ సుత్రామ డా"రాపాక ఏకాంబరా చార్యులు 85వ జయంతి సందర్భంగా నిర్వహించిన సభలో రాపాక ఏకాంబరా చార్యులు స్మారక పురస్కారాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల ధర్మపీఠం ఉప సభాపతి తుమ్మోజు రామ లక్ష్మణాచార్యులుకు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా సింహాద్రి కనకాచారి, రాష్ట్ర బిసి సాధికారిక కమిటీ కో-ఆర్డినేటర్ హాజరయ్యారు. తొలుత కుమారి యడ్లపల్లి సాయి ప్రణవి స్వాగత నత్యంతో ఆహూతులకు ఆహ్వానం పలుకగా, సంఘ ప్రదాన కార్యదర్శి డా"పుల్లేటికుర్తి ఎస్. వి. శ్రీనుబాబు అతిధులకు ఆహ్వానం పలికారు. సంఘ అధ్యక్షులు చింతలూరి సత్యనారాయణ ప్రారంభోప న్యాసం చేసి, పురస్కార నాందీ ప్రస్తావనను గుర్తు చేశారు. గారపాటి గురుబ్రహ్మాచార్యులు రాపాక వారి సాహితీ జీవితాన్ని ప్రస్తావించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు విశ్వబ్రాహ్మణ సేవా సంఘ విధి విధాలను, చేస్తున్న సేవలను, చేయబోవు కార్యక్రమ వివరాలను తెలియజేసారు. తుమ్మోజు రామలక్ష్మణాచార్యులు ను సాహితీ విశ్వజ్ఞ బిరుదుతో సత్కరించిన పిదప, పులుకూరి చంద్ర ప్రకాశ రావుని సాహితీ విభూషణ్ బిరుదుతో డాక్టర్ యండపల్లి పాండురంగాచార్యులును సాహితీ శ్రేష్ఠ బిరుదుతో, డిఆర్‌బి ప్రసాద్ ను సాహితీ కషీవల్లభ బిరుదుతో, చేపూరి జే. వి కుమార్ ను సాహితీ భూషణ్ బిరుదుతో, కొండపి శ్రీవేంకట గణేష్ బాబును సాహితీ కషి పుంగవ బిరుదుతో ఘనంగా సన్మానించారు. సన్మాన పత్రాన్ని చింతలూరి ఉమాదేవి శ్రావ్యంగా చదివి వినిపించారు. సంఘ కోశాధికారి చిట్టూరి ప్రవీణ్ కుమార్ వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో భవిరి శంకర్ నాథ్, గొర్రిపాటి ప్రభాకర్, తాతవోలు కనకమ్మ, ధవళేశ్వరపు ఉమా మహేశ్వర రావు, గుంటముక్కల రామబ్రహ్మం, మానేపల్లి బ్రహ్మాజీ, ముంతా వెంకటేశ్వర రావు, వరదా వెంకటేశ్వర రావు, మానేపల్లి గిరిధర్, మండపాక ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



తుమ్మోజు రామ లక్ష్మణాచార్యులుకు పురస్కారాన్ని అందజేస్తున్న దృశ్యం

అండర్‌పాస్‌లో నీటి నిల్వతో ఇబ్బందులు

ప్రజాశక్తి-పమిడిముక్కల : మచిలీ పట్నం-విజయవాడ బైపాస్ రహదారిపై పమిడిముక్కల మండలంలోని తాడంకి అండర్ పాస్ కింద నీరు ఎప్పుడూ నిల్వ ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. ఈ అండర్ పాస్‌కింద రహదారి ఎప్పుడు నీటితో నిండి ప్రయాణికులకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. బైపాస్ వేసిన ఇంజనీర్ల నిర్లక్ష్యమో, లేక కాంట్రాక్టు నిర్లక్ష్యమో ఎన్నో సంవత్సరాలు నుంచి ఈ నీటి సమస్య తీరని సమస్యగా ఉంది. ఈ అండర్ పాస్ కింద ఉన్న నీరు వల్ల పమిడిముక్కల మండలంలో చివర గ్రామాలు అయిన మర్రివాడ, గోపువానిపాలెం ప్రజలు రాత్రి వేళ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వచ్చి చూసి వెళ్తున్నారే తప్ప దీని సమస్యకు తీసుకున్న చర్యలు శూన్యం అని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు ఈ అండర్‌పాస్ లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని కోరుతున్నారు.


అండర్‌పాస్ వద్ద నీరు నిలిచి ఉన్న దృశ్యం

విద్యార్థుల క్షేత్రస్థాయి పర్యటన

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన బిఏ విద్యార్థులు పెడనలోని ప్రసాద్ కలంకారి పరిశ్రమలో క్షేత్ర పర్యటన నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి ఉమారాణి చరిత్ర విభాగాధిపతి డాక్టర్ డి రాజ్యలక్ష్మి, డాక్టర్ ఏ వీర కుమారి ఆధ్వర్యంలో క్షేత్ర పర్యటన జరిగింది. దీనిలో భాగంగా విద్యార్థులు డిజైన్ బ్లాకులు చెక్కతో ఎలా తయారు చేస్తారు, రాష్ట్రపతి కలంచే జాతీయ బహుమతి పొందిన కళాకారుడిని అడిగి తెలుసుకున్నారు. బల్ల ప్రసాద్ కలంకారి పరిశ్రమను సందర్శించి కలంకారికి ఆ పేరు ఎలా వచ్చింది, అలంకారీ పని విధానం కలంకారి డిజైన్ తయారీ దశలు కలంకారిలో వాడే రంగులు తయారీ గురించి, రంగుల అద్దకం కలంతో రంగులు అద్దుట కలంకారి పరిశ్రమ ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తీరు కలంకారి పరిశ్రమ వలన ఉన్న ఉపాధి అవకాశాలు ఆర్థిక ప్రయోజనాలు వివరించారు. కలంకారి అనేది సంస్కృతి సంప్రదాయానికి పర్యాయపదం అని, కళ మానవత్వం చరిత్రతో మనలను అనుసంధానించే వారధి అని తెలిపారు. అలాగే చిలకలపూడి పాండురంగ స్వామి దేవాలయం సందర్శించటం జరిగిందని, ఆలయ నిర్మాణ రీతుల గూర్చి వివరించడం జరిగిందని విద్యార్థుల అనుభవ పూర్వక విద్య క్షేత్ర పర్యటనలు ఉపయోగపడతాయని ప్రిన్సిపాల్ తెలిపారు.



కలంకారీ పరిశ్రమలో క్షేత్రస్థాయి సందర్శనలో పాల్గొన్న డిగ్రీ కళాశాల విద్యార్థులు

70 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : మచిలీ పట్నం ఉదయపు నడక మిత్ర మండలి భవనంలో యోగాసభ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. యోగా శిక్షణ తరగతులు అనంతరం వైద్యులు డాక్టర్ జిజిఎల్ శ్రావ్య యోగ సాధకులకు ఉచితంగా బిపి , షుగర్ పరీక్షలు చేసి అవసరమైన వారికి వైద్య సలహాలు, సూచనలు చేశారు. యోగా సభ్యులు, ఇతరులు తో సహా 70 మంది సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. యోగా గురువులు గురునాథ బాబు మహాలక్ష్మి చింతయ్య, సీనియర్ జర్నలిస్టు ముదిగొండ శాస్త్రి, యోగా సాధకులు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భాస్కర్ రావు,సమాచార శాఖ ఉప సంచాలకులు, యమ్ వెంకటేశ్వర ప్రసాద్, పశుసంవర్ధక శాఖ అధికారి జై విరమణ, తమ్మన సూర్యనారాయణ , ఆర్ డి ప్రసాద్ తదితర యోగా సభ్యులు అందరూ వైద్యులు డాక్టర్ జి జి ఎల్ శ్రావ్యను ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేసి జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆశీర్వదించారు.



బదిలీ అయిప ఉద్యోగికి సన్మానం

యోగా సభ్యులు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మన్నెం భాస్కరరావు మచిలీపట్నం నుంచి మాచర్లకు బదిలీ పై వెళుతున్న సందర్భంగా ఆదివారం యోగ సభ ఘనంగా సన్మానించింది.

వరద బాధితులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-చల్లపల్లి : ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ సేవలు అపూర్వమని పాస్టర్ జాన్‌పాల్ అన్నారు. ఆదివారం చల్లపల్లి మండలం పురిటిగడ్డ ఐవీఎం ట్రస్ట్ ప్రెసిడెంట్ డాక్టర్ వేములపల్లి సురేష్, రోజా దంపతుల ఆధ్వర్యంలో బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం పెదలంకలో 520మంది వరద బాధితులకు రూ.ఐదు లక్షల ఇరవై వేలతో దుప్పట్లు, చీరలు, లుంగీలు, టవల్స్ అందచేశారు. ఈ సందర్భంగా ఐవీఎం ట్రస్ట్ ప్రెసిడెంట్ డాక్టర్ వేములపల్లి సురేష్ మాట్లాడుతూ కృష్ణానదికి సంభవించిన భారీ వరదల నేపథ్యంలో కృష్ణానది పరిధిలోని లంక, ద్వీప గ్రామాల్లో సర్వస్వం కోల్పోయిన వరద బాధితులకు తమ వంతు సహాయం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.



వరద బాధితులకు దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం


బహుమతులు సాధించిన విద్యాలయ విద్యార్థులు

'విద్యాలయ' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - గుడివాడ : సెప్టెంబర్ 17వ తేదీ నుండి 28వ తేదీ వరకు స్థానిక రాజేంద్రనగర్ లోని రోటరీ భవన్లో, రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో జరిగిన రోటరీ యువజన ఉత్సవాలలో 9 క్యాటగిరిల్లో ప్రతిభా పరీక్షలు నిర్వహించగా అన్ని కేటగిరిల్లోను తమ విద్యార్థులు విజయం సాధించడం అభినందనీ యమని విద్యాలయ పాఠశాల డైరెక్టర్ బొప్పన విజయభాస్కర్, శాంతిలు అన్నారు. ఆదివారం పాఠశాలలో ఈ మేరకు విద్యార్థులను అభినందించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ పోటీలలో విద్యాలయ చిన్నారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యాలయ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బ్యానర్ల తొలగింపు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : జిల్లా ఎస్పీ గంగాధర్ ఆదేశాల మేరకు గుడ్లవల్లేరు వైయస్సార్ బ్రిడ్జి పైన ఉన్న వివిధ రకాల బ్యానర్లను ఆదివారం అధికారులు తొలగించారు. స్థానిక సెంటర్లోని బస్టాండ్ పైన, ప్రధాన రహదారి ప్రక్కన, వైయస్సార్ బ్రిడ్జిపై వివిధ రకాల భారీ ఫ్లెక్స్ బ్యానర్లను ఏర్పాటుచేసి నెలలు తరబడి వాటిని అలాగే ఉంచటంతో కొన్ని విధాల ఇబ్బందులు ఏర్పడుతున్నందున వీటిని తొలగించాలని జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గుడ్లవల్లేరు గ్రామ కార్యదర్శి ఎజెఎల్ నరసింహారావు, ఎస్ఐ సత్యనారాయణ వారి సిబ్బందితో బ్యానర్ల తొలగింపు చర్యలు చేపట్టారు.




కొనకళ్ల నారాయణరావును అభినందిస్తున్న నాయకులు

కొనకళ్లకు పలువురు అభినందనలు

ప్రజాశక్తి-పెదపారుపూడి : ఏపీఎస్ఆర్టీసీ ఛైర్మన్‌గా నియమితులైన కొనకళ్ళ నారాయణను పెదపారుపూడి మండలం లోని పలువురు టిడిపి నాయకులు అభినందించారు. మండల టిడిపి అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబు, టిడిపి పార్లమెంట్ నియోజకవర్గ నాయకులు సూరపనేని వెంకట సత్యనారాయణ, దానబోయిన వెంకటనారాయణ, మాజీ జెడ్పిటిసి చిలక ఆంజనేయులు, నాయకులు చప్పిడి కిషోర్‌లు కొనకళ్ళ ను ఆయన గహంలో మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాలతో అభినందించారు.

అన్నివేళలా వైద్య సేవలు

ప్రజాశక్తిపెదపారుపూడి : మండలంలో అన్నివేళలా ప్రభుత్వ వైద్య సేవలు అందిస్తున్నట్లు పెదపారుపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టర్ సాగరిక ఆదివారం అన్నారు. వర్షాకాలంలో సీజన్ వ్యాధులు సోకకుండా ఎటువంటి వైద్య సహాయం అవసరమైన స్థానికంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్య సిబ్బంది వైద్యం అందించటానికి 24 గంటలు పనిచేస్తున్నట్లు డాక్టర్ వివరించారు.

ముస్సిపల్ కార్మికులకు సిఐటియు ఆహార కేంద్రం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లి మున్సిపల్ కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు వరద బాధితుల సహాయార్థం సిఐటియు రాష్ట్ర కమిటీ సహయ సహకారాలతో ఆహార కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.కమల, ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి యం.మహేష్, నాయకులు వాసుదేవన్, పాపయ్య, బేబీ సరోజిని, కరుణ, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ప్రెసిడెంట్ బి.అప్పారావు ఉపాధ్యక్షులు రమణ దేవుళ్ళు మణికంఠ, నాగ్ పాల్గొన్నారు.


భోజనం వడ్డిస్తున్న నాయకులు

3 నుంచి పోలేరమ్మ దేవస్థానంలో దసరా ఉత్సవాలు

ప్రజాశక్తి - భవానీపురం : స్థానిక 43వ డివిజన్ ఊర్మిళానగర్‌లోని గ్రామదేవత పోలేరమ్మ దేవస్థానంలో అక్టోబర్ 3 నుంచి 12వ తేదీ వరకు దసరా మహోత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు దేవస్థానం కమిటీ అధ్యక్షులు సూరసాని రామిరెడ్డి చెప్పారు. ఆదివారం దేవస్థానం ప్రాంగణంలో దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రికను కమిటీ తరపున ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సూరసాని రామిరెడ్డి మాట్లాడుతూ అక్టోబర్ 3న శ్రీ పోలేరమ్మ స్వర్ణ కవచం అలంకారంతో మొదలై 12న శ్రీ రాజరాజేశ్వరిదేవి అలంకారంతో దర్శనమిస్తారని తెలిపారు. దేవస్థానం కమిటీ కార్యదర్శి గుత్తావలి విజయ బాబు, సహాయ కార్యదర్శి మాగం



ఆత్మా రాము, కోశాధికారి దొడ్డా వెంకటేశ్వర్లు, ఆలయ అర్చకులు గంటి సన్యాసిరావు, రాచమళ్ల రమణమ్మ పాల్గొన్నారు.

వరద ముంపు ప్రాంతంలో ఎంఎల్‌ఎ పర్యటన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ఇటీవల కురిసిన వర్షాలకు జగ్గయ్యపేట పట్టణంలో ముంపునకు గురైన ధనంబోర్డు, విద్యానగర్, దుర్గాపురం కాలనీలో స్థానిక నాయకులతో కలిసి ఎంఎల్‌ఎ శ్రీరాం తాతయ్య పర్యటించారు. ఈ సందర్భంగా వార్డులోని ప్రజలు వారికి ఉన్న సమస్యలను గత వైసిపి ప్రభుత్వంలో పెన్షన్లు పెట్టలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా అందరినీ అన్ని విధాల ఆదుకుంటామని వారికి హామీ ఇచ్చారు. ముంపునకు గురైన ప్రాంతంలో గ్రావెల్‌ను ఏర్పాటు చేయాలని, అండర్ గ్రౌండ్ వాటర్‌ను తొలగించాలని మున్సిపల్ అధికారులకు, రైల్వే అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి సెక్రటరీ మైనేని రాధాకష్ణ, మాజీ ఏఎంసి చైర్మన్ కట్టా వెంకట నరసింహారావు, పట్టణ తెలుగు యువత అధ్యక్షులు వేదులాపురి సైదా, కౌన్సిలర్ పేరం సైదేశ్వరరావు, పాల్గొన్నారు.

మీడియాకు సహాయ సహకారాలు అందిస్తాం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని టీచర్స్ కో-ఆపరేటివ్ బిల్డింగ్‌లో ఏపీ ఎంపీఏ (ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్ అసోసియేషన్) సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీరామ్ యాదవ్, శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య పాల్గొన్నారు. జర్నలిస్టుల సమస్యలపై శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్యకు ఏపీఎంపీఏ రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీరామ్ యాదవ్ వివరణ ఇచ్చారు. ఎంఎల్‌ఎ శ్రీరామ్ తాతయ్య మాట్లాడుతూ పట్టణంలో ప్రెస్ క్లబ్ ఏర్పాటుకు సహాయ సహకారాలు అందిస్తానని నియోజకవర్గంలోని ప్రతి జర్నలిస్టుకు ప్రభుత్వమే స్థలం కేటాయించి ఇల్లు నిర్మించి విధంగా చర్యలు తీసుకుంటానని, జర్నలిస్టుల హెల్త్ స్కీమ్‌ను రెండు లక్షల నుండి 10 లక్షలు పెంచేలా ప్రభుత్వాన్ని కోరతానని తెలిపారు.

నోటు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఇటీవల సంభవించిన వరదల నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో నివసించే విద్యార్థిని, విద్యార్థులకు న్యూ జనరేషన్ యూనిటీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పుస్తకాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. వరదల కారణంగా తడిసిపోయిన నోటు పుస్తకాల వారికి సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి సాయి వినయ్ కుమార్, ది కష్ణా డిస్ట్రిక్ట్ ఫార్మా డీలర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రవీంద్రనాథ్ రెడ్డి, సెక్రటరీ వి.నారాయణ, సభ్యులు నిఖిల్, గోపాలకష్ణ, గుప్తా, శివ, పుల్లారావు, చైతన్య, నాయుడు, మరికొందరు పాల్గొని వరద ప్రాంతాలైన మిల్క్ ప్రాజెక్ట్, అజిత్ సింగ్ నగర్, ఓల్డ్



రాజరాజేశ్వరిపేట, వాంబే కాలనీ, రాణిగారి తోట, ప్రకాష్ నగర్ నుండి వచ్చిన 300 మందికి పైగా విద్యార్థులకు నోటు పుస్తకాలు, పరీక్ష అట్టలు, పెన్నులు, బిస్కెట్ ప్యాకెట్ సంస్థ కార్యాలయాల్లో పంపిణీ చేసినట్లు సంస్థ నిర్వాహకుడు సాయి వినయ్ కుమార్ తెలిపారు.

ఎంఎల్‌సి ఎన్నికలకు సిద్ధం కావాలి: సౌమ్య

ప్రజాశక్తి - నందిగామ : ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలని నందిగామ ఎంఎల్‌ఎ తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. శనివారం రాత్రి నందిగామ కార్యాలయంలో ఏర్పాటు చేసిన క్లస్టర్, యూనిట్, బూత్ కన్వీనర్లు, నియోజకవర్గ ముఖ్యనేతల సమావేశం ఏర్పాటు చేశారు. కృష్ణా - గుంటూరు ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎంఎల్‌సి నియోజకవర్గాల ఓటరు నమోదు ప్రక్రియ ఈ నెల 30 నుంచి ప్రారంభం కానుందని దీనికి అందరూ సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. ఎంఎల్‌ఎ తంగిరాల సౌమ్య మాట్లాడుతూ కొత్త పింఛన్లను అక్టోబర్, నవంబర్‌లో మంజూరు చేస్తామన్నారు. దీపావళి నుంచి మహిళలకు ఉచితంగా సిలిండర్లు పంపిణీ చేస్తామన్నారు. సభ్యత్వపార్టీ నమోదుపై పలుఅంశాలు కార్యకర్తలతో చర్చించారు. వరద బాధితులకు రూ.602 కోట్ల సాయం అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు కోట వీరబాబు, ఏచూరి రాము, కాకర్ల శ్రీనివాసరావు, శ్రీనివాస్ చారి, గ్రామ, మండల నాయకులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్చార్జులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదుకు అవకాశం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదుచేసుకునే అవకాశం ఎన్నికల సంఘం కల్పించిందని ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాల్సిందిగా అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 30 నుండి నవంబర్ 6వ తేదీ వరకు కేంద్ర ఎన్నికల కమీషన్ వారి వెబ్‌సైట్‌లోఓటరుగా నమోదుచేసుకోవచ్చు. ఎంఆర్ఓ కార్యాలయం వద్ద కూడా ఫారం 18 దాఖలు చేసి ఓటటు నమోదుచేసుకోవచ్చు. ఫారం 18లో పాస్‌పోర్టు ఫోటో, గెజిటెడ్ ఆఫీసర్‌చే ధృవీకరించబడిన డిగ్రీ సర్టిఫికెట్ నకలు కాపీ జతచేయాలి. ఓటర్ ఐడీ కార్డు, ఆధార్ కార్డు కూడా జతపరచాలి. ఓటరుగా నమోదుకావడానికి జూన్ 2021లోపు డిగ్రీ ఉత్తీర్ణత సాధించి ఉండాలని అధికారులు తెలిపారు ఇంజనీరింగ్ మెడిసిన్, సీఏ ఇతర పీజీ డిప్లమా పూర్తి చేసిన వారు కూడా ఓటర్లుగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. 10వ తరగతి తరువాత దూరవిద్యలో డిగ్రీ పూర్తి చేసిన వారు అనర్హులని అధికారులు ప్రకటించారు.

లీకేజీలను పరిశీలిస్తున్న సత్యబాబు



వాటర్ పైప్‌లైన్లు మార్చాలి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పశ్చిమ నియోజకవర్గంలోని గొల్లపాలెం గట్టు కొండ ప్రాంతంలో టైలర్ పేట, జోడు బొమ్మలు ప్రాంతాల్లో 25 వాటర్ పైపులైన్లు లీకేజీలు అవుతున్నాయని, వాటి స్థానంలో నూతన పైపులైన్లు ఏర్పాటు చేయాలని సిపిఎం ఫ్లోర్‌లీడర్, 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు తెలిపారు. పైపులైన్ల లీకేజీల వల్ల ఈ ప్రాంత ప్రజలు మంచినీరు అందక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఆదివారం కార్పొరేటర్ బోయి సత్యబాబు డివిజన్ పర్యటనలో భాగంగా స్థానికులు సమస్యను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందిస్తూ సత్యబాబు మాట్లాడుతూ సంబంధిత విఎంసి మంచినీటి విభాగం. అధికారులకు ఇప్పటికే పలుమార్లు ఫిర్యాదు చేశామని, వారు పట్టించుకున్న పరిస్థితి లేదని అన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో మంజూరైన నిధులతో పైప్‌లైన్లు మార్చే పనులు మూడేళ్లు గడుస్తున్న పూర్తిచేయడంలో నిర్లక్ష్యంపై మున్సిపల్ కమిషనర్ దష్టి పెట్టాలని కార్పొరేటర్ సత్యబాబు కోరారు. ఈ పర్యటనలో సిపిఎం నగర కమిటీ సభ్యులు రాజు, నాయకులు సిహెచ్ దుర్గారావు, శివ పాల్గొన్నారు.



చెప్పులు, దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - భవానీపురం : పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు యలమంచిలి సత్యనారాయణ (సుజన) చౌదరి ఆదేశాల మేరకు పశ్చిమలోని పారిశుధ్య కార్మికులకు ఎన్డీఏ కూటమి నేతలు నాగుల్ మీరా, అడ్డూరి శ్రీరామ్, జిప్పర్స్ కంపెనీ అధినేతలు గణేష్, శ్రీను బాబు తదితరులు ఆదివారం భవానీపురం ఎన్డీఏ కార్యలయంలో దుస్తులు, చెప్పులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అడ్డూరి శ్రీరామ్ మాట్లాడుతూ ఇటీవల సంభవించిన వరదల సమయంలో ప్రజల ఆరోగ్య పరిరక్షణకు, పరిశుభ్రతకు విశేషంగా కషిచేసిన పారిశుధ్య కార్మికుల సేవలు అభినందనీయం అన్నారు. ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆదేశాల మేరకు సుజనా ఫౌండేషన్, జిప్పర్స్ కంపెనీల సహకారంతో పశ్చిమంలోని 995 మంది పారిశుధ్య కార్మికులకు బట్టలు, చెప్పులతో కూడిన కిట్ల పంపిణీ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. టిడిపి మైనార్టీ నాయకులు నాగుల్ మీరా మాట్లాడుతూ విపత్తులతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు కూటమి ప్రభుత్వం తరపున సేవలందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు పైలా సోమినాయుడు, కార్పొరేటర్లు గుడివాడ నరేంద్ర రాఘవ, బుల్లా విజయ్‌కుమార్, టిడిపి నాయకులు యేదుపాటి రామయ్య, జనసేన నాయకులు మల్లెపు విజయలక్ష్మి, జిప్పర్స్ కంపెనీ అధినేతలు గణేష్, శ్రీనుబాబు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : ఇటీవల వినాయక విగ్రహ ఊరేగింపు సందర్భంగా టపాసులు పేలి గాయపడిన రాఘవపురం, వడ్డెర కాలనీ చెందిన చంద్రగిరి నాగరాజుకు వసంత కష్ణ ప్రసాద్ సైన్యం విజయబాబు ఆదేశాల మేరకు రూ.5వేలు ఆర్థికసాయం ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉయ్యూరు వెంకటేశ్వర రెడ్డి (పెద్దోడు), పవన్ కుమార్ రెడ్డి (మ్యాంగో మార్కెట్), ప్రణయ్ కుమార్ రెడ్డి, చామల కోటిరెడ్డి, ఉయ్యూరు బాలకృష్ణారెడ్డి మరికొంతమంది విజయబాబు సైన్యం పాల్గొన్నారు.




లక్ష్మీ అపర్ణ ను అభినందిస్తున్న ఎంఎల్‌ఎ

అండర్ 19కు ఎంపికైన లక్ష్మీ అపర్ణకు అభినందనలు

ప్రజాశక్తి - నందిగామ : ఆంధ్రప్రదేశ్ క్రికెట్ అండర్ 19 స్టేట్ టీ - 20 గవర్నమెంట్‌కు పోపూరి లక్ష్మీ అపర్ణ ఎంపిక కావటం హర్షించదగ్గ విషయమని నందిగామ ఎంఎల్‌ఎ తంగిరాల సౌమ్య అన్నారు. నందిగామ నియోజకవర్గం తుర్లపాడు గ్రామానికి చెందిన పోపూరి సత్యం మనమరాలు అపర్ణ టి - 20 టోర్నమెంట్లో విజయం సాధించాలని తంగిరాల సౌమ్య ఆకాంక్షించారు. ఆదివారం నందిగామ కాకాని నగర్ ఎంఎల్‌ఎ కార్యాలయంలో గ్రామస్తులు స్థానిక నేతలతో కలిసి అపర్ణ తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని టోర్నమెంట్లలో రాణించి లక్ష్మీ అపర్ణ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు పాల్గొన్నారు.



ఉచిత గుండె వైద్య శిబిరం

ప్రజాశక్తి - వత్సవాయి : కన్నెవీడు గ్రామంలో ఎజిఎస్ చారిటబుల్ ట్రస్ట్ వారి అధ్యర్యంలో వై.వి.రావు హాస్పిటల్ సహకారంతో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు విరివిగా పాల్గొన్నారు. డాక్టర్ శ్రీనివాస్ గుండె నిపుణులందరినీ చెక్ చేసి గుండె సమస్యలు ఉన్న వారిని గుర్తించి హిస్పిటల్ వెళ్లాలని సూచించారు. కొందరికి మందులు ఇప్పించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ ఆదిమళ్ళ ప్రసన్న కుమారి, వైస్ చైర్మన్ ఆదిమళ్ళ సురేష్ బాబు, ట్రెసరేర్ సెంగాపొంగు ప్రశాంత్ హాస్పిటల్ సిబ్బంది అనిల్ తదితరులు పాల్గొన్నారు.



ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌కు సన్మానం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్.మణికంఠ రెడ్డి పశ్చిమగోదావరి జిల్లా తణుకు ఎక్సైజ్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఆవారం స్టేషన్‌లో ఆయనను సన్మానించారు. సాధారణ ఎన్నికల నేపథ్యంలో జరిగిన బదిలీలలో భాగంగా జనవరి నెలలో ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ తొమ్మిది నెలల్లో తన విధి నిర్వహణలో తనకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. జగ్గయ్యపేట ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా గతంలో ఇక్కడ పనిచేసిన బి.గురవయ్య రానున్నారు.

తెలుగు భాషను విశ్వవ్యాప్తం చేసిన మండలి కృష్ణారావు

- పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యతపై స్ఫూర్తిదాయక రచనలు అవసరం
- హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అంబటి శంకర్ నారాయణ



ప్రసంగిస్తున్న జస్టిస్ అంబటి శంకర్ నారాయణ



బుద్ధ ప్రసాద్ రచించిన 'కృష్ణం వందే జీవనాధారం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు, అతిధులు

ప్రజాశక్తి-అవనిగడ్డ : మొట్టమొదట ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించడం ద్వారా తెలుగు భాషను విశ్వవ్యాపితం చేసిన మహానాయకుడు, మాజీ మంత్రి, మండలి వెంకటకృష్ణారావు అని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అంబటి శంకర్ నారాయణ తెలిపారు. మండలి వెంకటకష్ణారావు 27వ వర్ధంతి పురస్కరించుకొని అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో ఆదివారం 'ప్రకృతి వైపరీత్యాలు పర్యావరణ పరిరక్షణ రచయితల పాత్ర' అనే అంశంపై జిల్లా రచయితల సంఘం 16వ మహాసభలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శంకర్ నారాయణ మాట్లాడుతూ 1977లో దివిసీమకు ఉప్పెన సంభవించగా ఉప్పెనకు చెల్లించిపోయి మంత్రి పదవిని రుణప్రాయంగా రాజీనామా చేసి తనకు ప్రజలే ముఖ్యమని స్పష్టం చేసిన స్టేట్స్ మాన్ మండలి వెంకట కృష్ణారావు అని కొనియాడారు. బాధిత దివిసీమ పునర్నిర్మాతగా 1975 తొలి ప్రపంచ తెలుగు మహాసభల రూపకర్తగా కష్ణారావు ఖ్యాతి చిరస్మరణీయమన్నారు. కృష్ణాజిల్లా రచయితల సంఘం వ్యవస్థాపక గౌరవ అధ్యక్షులుగా కృష్ణారావు కృషితో నేటికీ ఈ సంఘం అద్భుతమైన సేవ చేస్తుందన్నారు. ప్రకృతి విపత్తులకు కారణమైన మానవ తప్పిదాలను నిరోధించేందుకు పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యత ప్రజలకు వివరించేందుకు రచయితలు తమ ప్రతిభతో అద్భుతమైన స్ఫూర్తిదాయక రచనలు అందించాలని కోరారు. ప్రతి ఒక్కరూ వాతావరణంలో ఉష్ణోగ్రతలు పెరిగేందుకు కారణాలు, వాతావరణంలో వస్తున్న మార్పులు తెలుసుకోవాలన్నారు. ప్రకతి వనరులను దోచుకో కూడదని సహజ వనరులను మనం అడ్డుకోకూడదు అన్నారు. ఆక్సిజన్ అందించే చెట్లను ప్రతి ఒక్కరు చిప్కో ఉద్యమం స్ఫూర్తితో కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఈ ఏడాది చివర డిసెంబర్ నెలాఖరులో నిర్వహించే ఆరవ ప్రపంచ తెలుగు మహాసభలు విజయవాడలోని కేబీఎన్ కళాశాలలో నిర్వహిస్తుండడం తమకు ఎంతో ఆనందాన్నిస్తోందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వంగల నారాయణరావు తెలిపారు. మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచ తెలుగు మహాసభల్లో ప్రపంచ దేశాల్లో విస్తతంగా తెలుగు సంఘాల ఏర్పాటుకు బాటలు వేశాయన్నారు. ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ 1982 జూలైలో10,11 తేదీల్లో దివిసీమ సాహితీ సమితి ఆధ్వర్యంలో గాంధీ క్షేత్రంలో జిల్లా రచయితల మహా సభలు నిర్వహించినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ దిగంబరకవి రచయిత నగ్నముని మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో అనేక తెలుగు సంఘాల ఆవిర్భావానికి ఈ సంఘం బాటలు వేసింది అన్నారు. ఈ సందర్భంగా పలువురు కవులకు సేవ పురస్కారాలు అందజేశారు. అందులో మండలి వెంకటకష్ణారావు భాషా సేవా పురస్కారాన్ని ఆచార్య అప్ప జోష్యుల సత్యనారాయణకు మండలి బుద్ధ ప్రసాద్ బహుకరించారు. ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ నెలకొల్పిన ఆలూరి బైరాగి కవిత పురస్కారాన్ని బండ్ల మాధవరావుకు ప్రధానం చేయగా, గుత్తికొండ సుబ్బారావు తాను నెలకొల్పిన గుత్తికొండ సుబ్బారావు సాయితీ సేవ పురస్కారాన్ని పెనుగొండ లక్ష్మీనారాయణకు ప్రధానం చేశారు. అలాగే కోళ్ల నారాయణరావు తాను నెలకొల్పిన పోలవరపు కోటేశ్వరరావు కథా సాహిత్య పురస్కారాన్ని రావులపాటి సీతారాం మారుతి పౌరహితములకు ప్రధానం చేశారు. ఆచార్య నూతక్కి ప్రతిభ నెలకొల్పిన ముక్కామల నాగభూషణం పాత్రికేయ పురస్కారాన్ని బాలబాట కె ఎస్ వి రమణమ్మకు ప్రధాన చేశారు. అలాగే వేములపల్లి కేశవరావు నెలకొల్పిన వేములపల్లి కేశవరావు విశాల అనువాద సాహిత్య ప్రతిభా పురస్కారాన్ని స్వాతి శ్రీపాదకు ప్రధానం చేశారు. కష్ణా జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు గుత్తికొండ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి వి పూర్ణచంద్, కార్యదర్శులు భవిష్య కరెడ్ల సుశీల, గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షులు మండలి వెంకట్రామ్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో కవి సమ్మేళనం నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన 58 మంది కవులు రచయితలు ప్రకతి వైపరీత్యాలు అనే అంశంపై అద్భుతమైన తమ స్వీయ కవితలు రచనలు వినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ రచించిన కష్ణం వందే జీవనాధారం పుస్తకాన్ని హైకోర్టు మాజీ న్యాయమూర్తి అంబటి శంకర్ నారాయణ ఆవిష్కరించారు



'సంకల్ప-2024'లో గుడ్లవల్లేరు పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : గుంటూరుకు చెందిన కల్లం హరనా ధరెడ్డి ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ వారు ఈ నెల 27 తేదీన జాతీయ స్థాయి టెక్నికల్ ఫెస్ట్ సంకల్ప- 2024ను ఇంజనీరింగ్, డిప్లొమా విద్యార్థులకు నిర్వహించగా, అందులో గుడ్లవల్లేరు ఏఏఎన్ఎమ్ అండ్ వివిఆర్ఎస్ఆర్ పాలిటెక్నిక్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగానికి చెందిన విద్యార్థులు మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నారని ప్రిన్సిపాల్ ఎన్.రాజశేఖర్ తెలిపారు. కళాశాలకు చెందిన ఎ.వి.ఎస్. అక్షయ్, ఎ.కృష్ణ తేజలు 'ప్రాజెక్ట్ ఎక్సిబిషన్ పవర్ జనరేషన్ యూసింగ్ రేనేవల్బుల్ సోర్సెస్' అనే అంశంపై ఇంజనీరింగ్ విద్యార్థులతో పోటీపడి మొదటి స్థానాన్నికైవసం చేసు కోవడంతో పాటు రెండు వేల రూపాయలల నగదును కూడా అందుకున్నారని తెలిపారు. బహుమతులు సాధించిన విద్యార్థులను, వారికీ ప్రత్యేక శిక్షణను అందిచిన ఇసిఇ బ్రాంచ్ విభాగాధిపతి జివివి సత్యనరాయణను, అధ్యాపకులను యాజమాన్య సభ్యులు ఛైర్మన్ డాక్టర్ వల్లూరుపల్లి,నాగేశ్వరావు, సెక్రటరీ, కరస్పాండెంట్ వల్లూరుపల్లి సత్యనారాయణరావు, కో సెక్రెటరీ, కరస్పాండెంట్ వల్లూరుపల్లి రామకృష్ణ తదితరులు అభినందించారు.

నేడు కలెక్టరేట్‌లో 'మీకోసం'

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటల 30 నిముషాలకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'మీకోసం' కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా మీకోసం జరుగుతుందని, ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ ప్రజలను కోరారు.

కొండాలమ్మను దర్శించుకున్న యాత్రికులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం గ్రామమంలో ఉన్నశ్రీ కొండలమ్మ అమ్మవారిని ఆదివారం అధిక సంఖ్యలో యాత్రికులు దర్శించుకుని మొక్కు బడులను తీర్చుకున్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి ఆకుల కొండలరావు తెలిపారు. సుమారు 15 వేలమంది యాత్రికులు శ్రీ అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు అమ్మవారికి పాల పొంగళ్ళు సమర్పించి వారి మొక్కు బడులను తీర్చుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. అక్టోబర్ 3వ తేదీ నుండి 12వ తేదీ వరకు శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగు సందర్భంగా అమ్మవారి దేవస్థానంలో పండుగ వాతావరణం మొదలైంది. ఆలయానికి రంగులు, కొత్త పందిళ్ళ శోభతో ఆలరారుతోంది.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఈవో ఆకుల కొండలరావు

గండిని తక్షణమే పూడ్చాలి : రైతు సంఘం

ప్రజాశక్తి-గన్నవరం : ఇటీవల కురిసిన వర్షానికి చిక్కవరం గ్రామంలో కొండా మోర్ డొంక కట్ట తెగిపోయిందనీ, దానిని పూడ్చేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం నాయకులు నల్లూరి ధర్మారావు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కట్ట తెగిపోవడం వల్ల సుమారు 500 ఎకరాలు వరి పంట లోకి భారీగా నీరు చేరిందన్నారు. ఈ గండి పుడ్చటానికి పోలవరం, ఇరిగేషన్ అధికారులు ముందుకు రావటం లేదన్నారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని పేద రైతులను రక్షించాలని అన్నారు. ఇంకావర్షాలు పడుతూనే ఉన్నాయనీ, ఆ నీరు అంతా రైతుల పొలాల్లోకి వెళుతూ చాలా నష్టం జరుగుతుందని రైతులు అందోళనకు గురి అవుతున్నారని తెలిపారు. నష్టం జరగ కుండా ఉండాలంటే ప్రభుత్వం గండిని పుడ్చాలని విజ్ఞప్తి చేశారు.

నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకోవాలి

- రైతు సంఘం రాష్ట్ర నాయకులు వై. కేశవరావు



మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర నాయకులు వై కేశవరావు

ప్రజాశక్తి - నందివాడ(గుడివాడ) : నందివాడ మండలంలో వరదల వల్ల జరిగిన నష్టపోయిన ప్రతిఒక్కరికి ప్రభుత్వ సాయం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతు సంఘం రాష్ట్ర నాయకులు వై కేశవరావు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని పుట్టగుంట గ్రామంలో రైతు, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో రైతుసంఘం జిల్లా నాయకులు నీలం మురళీకృష్ణ అధ్యక్షతన మండల సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న కేశవరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పంట నష్టం తీవ్ర స్థాయిలో ఉందని, ఇంకా కొంత భూమిలో నేటికీ నీరు పోలేదని ఫలితంగా పంట పొలాలు కుళ్ళి దుర్వాసన వెదజల్లుతుందన్నారు. అధికారులు పంట నష్టాన్ని ఆ స్థాయికి అనుగుణంగా అంచనాలు చేయలేక పోతున్నారన్నారు. కాబట్టి మండల, జిల్లా స్థాయి అధికార ప్రతినిధుల బృందం మండలంలో పర్యటించి పూర్తిస్థాయి విచారణ జరిపి పరిహారం చెల్లించాలన్నారు. రైతులు, కౌలు రైతులు పెట్టుబడికి అనునుగుణంగా రూ.25 వేలు తగ్గకుండా నష్ట పరిహారాన్ని అందించాలన్నారు. అలాగే బ్యాంకులు రుణాలు మాఫీ చేయాలని, మరో పంటకి రుణ సహాయం అందించాలని, దీనికి పూర్తిస్థాయి బాధ్యత ప్రభుత్వమే వహించాలని అన్నారు. కొన్ని ప్రాంతాల్లో కౌలు రైతులు ముందుగానే కౌలు చెల్లించే ఆనవాయితీ ఉందని ఆ విధంగా ముందస్తు గా కౌలు చెల్లించిన రైతులకు ఆ పరిహారాన్ని ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయం చాలా కీలకమైందని, అలాంటి కీలకమైన రంగాన్ని రైతులను నిర్లక్ష్యం చేయకుండా వారిని ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకుని సాగు చేస్తున్న రైతులకు రెండు లక్షల వరకు అప్పు ఉన్న ప్రతి రైతుకు ఆ అప్పు పూర్తిగా బ్యాంకులు రద్దు చేయాలని అన్నారు. దేశంలో కార్పొరేట్ దిగ్గజం అయినా అంబానీ సంస్థకి 40 వేల కోట్లు రుణమాఫీ చేసిన ప్రభుత్వాలు దేశానికి అన్నం పెడుతున్న అన్నదాత ఆపదలో ఉన్నాడని అలాంటి ఆపదలో ఉన్న అన్నదాతకు రుణమాఫీ చేయడం ప్రభుత్వాల కనీస బాధ్యత అని అన్నారు. వరదల వల్ల 250 మోటార్లు పాడైపోయాయని వాటికి కూడా ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలన్నారు. అంతే కాకుండా వరద ముంపులో మునిగిపోయిన ఇళ్ళకు, చనిపోయిన గేదెలకు, మేకలకు కూడా నష్టపరిహారం అందించాలన్నారు. జిల్లాలో పంట నష్టపరిహారాన్ని పూర్తిస్థాయిలో అంచనా వేయకుండా రోడ్ల మీద సర్వేలు చేసి అంచనా వేసి పరిహారం చెల్లిస్తున్నారని,ఇది సరైన పద్ధతి కాదన్నారు. పూర్తిస్థాయి విచారణ చేసి వాస్తవ కౌలుదారుకు పరిహారాన్ని అందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పంచకర్ల రంగారావు, రైతులు, కౌలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

కూడేరు-కృష్ణాపురం రహదారి గోతులమయం

ప్రజాశక్తి-పమిడిముక్కల : మండలంలోని కూడేరు- కృష్ణాపురం రహదారి గోతులు మయంగా మారి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారిపై గోతుల్లో నీరు నిలిచి ఉండడంతో ప్రయాణీకులకు ప్రయాణం ప్రమాదకరంగా మారింది. రాత్రిళ్ల అయితే ఈ రోడ్డుపై ప్రయాణం అంటేనే ఏం ప్రమాదం ముంచుకొస్తుందోనని భయపడిపోతున్నారు. ఈ రోడ్డుపై కూడేరు, ఐలూరు, కష్ణాపురం తదితర గ్రామాల ప్రజలు ప్రయాణిస్తుంటారు. విద్యార్థులు సైకిల్ మీద పాఠశాలకు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. అలాగే విజయవాడకు ప్రయాణం ఈ రోడ్డుపైనే ఐలూరు కట్ట వరకు ఎక్కువగా ఉంటుంది. కాబట్టి అధికారులు, స్థానిక ఎంఎల్ఎ అయితే వర్ల కుమార్ రాజా ఈరోడ్డును బాగుచేయాలని ప్రయాణీకులు కోరుతున్నారు.



గతుకులుగా ఉన్న రహదారి

అధ్వానంగా దాములూరు-కూడలి రహదారి

ప్రజాశక్తి- నందిగామ : ఇటీవల వచ్చిన వరదలకు రహదారులు పూర్తిగా కోతకు గురై కొట్టుకు పోవటంతో దాములూరు-కూడలి రహదారి పూర్తిగా ధ్వంసమై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రోడ్డుకు గండ్లు పడి దాదాపు నెల రోజులైనా అధికారులు, పాలకులు రోడ్డు వేయకుండా నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. ఆదమరిచామా అంతే సంగతులన్నట్లుగా దాములూరు-కూడలి రహదారులున్నాయి.


రైతులకు అగచాట్లు

మండలంలోని దాములూరు నుండి కూడలి దేవస్థానానికి, పల్లంపల్లి రోడ్డు మూడు చోట్ల తారు రోడ్డుకు గండ్లు పడి నెల రోజులవుతోంది. కంచికచర్ల నుండి తెలంగాణ వెళ్లటానికి ప్రధానమైన రహదారిగా కూడా ఎక్కువమంది ఈ రోడ్డును ఉపయోగిస్తారు. ఇటీవల వైరా-కట్లేరు-మున్నేరు వరదలు ఉగ్ర రూపం దాల్చటంతో, వరదల వల్ల రోడ్డు మొత్తం పాడైపోయి రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉంది. కనీసం కారు గానీ పొలాలకు వెళ్లడానికి ట్రాక్టర్ గాని వెళ్లే పరిస్థితి లేదు. రైతులు, వాహనదారులు చాలా ఇబ్బంది పడుతున్నారు. ఈ రోడ్డు గుండా ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లటానికి ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు కింద నుండి అక్కడక్కడా గుంటలు ఉన్నాయి. ఆదమరిచారా అంతే గుంటలోకి వెళ్లి ప్రమాదం అయ్యే అవకాశాలు చాలా ఉన్నాయి. జగ్గయ్యపేట ఎంఎల్ఎ శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య), ఆర్అండ్‌బి అధికారులు వచ్చి చూసి వెళ్లారు. అయినా ఇంతవరకు ఈ రోడ్డుకు మోక్షం కల్పించలేదని రైతులు, వాహనదారులు వాపోతున్నారు. తక్షణమే ఈ రోడ్డును మరమ్మతులు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

తక్షణమే దాములూరు-కూడలి రహదారి బాగు చేయాలి : సిపిఎం



ఇటీవల వచ్చిన వరదలకు పూర్తిగా ధ్వంసమై రాకపోకలకు అంతరాయం కలుగుతున్న దాములూరు-కూడలి కూడలి రహదారి తక్షణమే బాగు చేయాలని సిపిఎం నందిగామ కార్యదర్శి కటారపు గోపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న రోడ్డు



పూర్తిగా కోతకు గురైన దాములూరు - కూడలి రహదారి



ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - తిరువూరు : బొలెరో వాహనం ఢీకొని బైకిస్టు మృతిచెందిన ఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... భగత్ సింగ్ కాలనీకి చెందిన ముంగి గోపీ (22), 12 ఏళ్ల బాలుడితో కలిసి టివిస్ ఎక్సెల్ వాహనంపై ముత్తగూడెం నుండి తిరువూరు వస్తుండగా ఆంజనేయ గ్రాండ్ రెస్టారెంట్ వద్దకు రాగానే మైలవరం వైపు నుండి వేగంగా వస్తున్న బొలెరో వాహనం బలంగా వారిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో గోపీ తలకు బలమైన గాయం అవ్వడంతో అక్కడికక్కడే మృతిచెందగా బాలుడు మణికంఠకు తీవ్ర గాయాలయ్యాయి. గోపీ మతదేహాన్ని తిరువూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. తీవ్ర గాయాలైన మణికంఠను మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించారు.



బొర్రా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ముఖేష్ కుమార్ మీనా, తదితరులు

బొర్రా కుటుంబానికి ముఖేశ్ పరామర్శ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : రాష్ట్ర ఎన్నికల మాజీ ప్రధానాధికారి, ఎక్సైజ్ (రెవెన్యూ), గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేశ్ కుమార్ మీనా ఆదివారం ఇబ్రహీంపట్నం మాజీ జడ్జీటీసీ సభ్యుడు బొర్రా వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇటీవల బొర్రా వెంకటేశ్వరరావు అనారోగ్యంతో మృతిచెందడంతో కొండపల్లిలోని ఆయన స్వగృహంలో బొర్రా వెంకటేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. బొర్రా వెంకటేశ్వరరావు కుమారులు కిరణ్, క్రాంతితో మాట్లాడారు. వెంకటేశ్వరరావు మృతికి సంతాపం తెలిపి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి - మైలవరం : లయన్స్ క్లబ్ 316 డిస్టిక్ గవర్నర్స్ ఫస్ట్ జోన్ కమిటీ మీటింగ్ ఆదివారం స్థానిక ఎస్‌విఎస్ కళ్యాణమండపంలో జోన్ చైర్పర్సన్ జాస్తివెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా పాస్ట్ మల్టీప్ల్ కౌన్సిల్ చైర్ పర్సన్ లయన్ ఎస్.వి.ఎన్.నివృతరావు, ఫస్ట్ వైస్ డిస్టిక్ గవర్నర్ లయన్ వివి పివిస్ ఆంజనేయులు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. దయాలసిస్ కేంద్రాలు, వరదలు సంభవించినప్పుడు అన్నదానం, మహిళల కుట్టుమిషన్లు అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జివిస్టి డిస్టిక్ కోఆర్డినేటర్ మద్దినేని చంద్రశేఖర్, జిఎంటి డిస్టిక్ కోఆర్డినేటర్ రవీంద్ర, జియాలటి డిస్టిక్ కో ఆర్డినేటర్ ఎన్‌విఎస్‌వి.ప్రసాద్, జిటి డిస్టిక్ కోఆర్డినేటర్ ఆర్.కొండలరావు, లయన్స్‌క్లబ్ ఆఫ్ మైలవరం కార్యవర్గం, లయన్స్ సభ్యులు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు ఎంఎల్ఎ సాయం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ఆటో, బైక్ ఢీకొని గాయాలపాలైన వారిని ఎంఎల్ఎ శ్రీరాం తాతయ్య తన వాహనంలో ఆస్పత్రికి తరలించారు. పట్టణంలో ఎస్.జి.ఎస్ కాలేజీ సమీపాన ఆటో, బైక్ ఢీకొన్న ప్రమాదంలో జగ్గయ్యపేట పట్టణం తొర్రగుంటపాలెంనకు చెందిన ఇద్దరు యువకులు తీవ్ర గాయాలతో రోడ్డుపై పడి ఉండగా విజయవాడ నుండి జగ్గయ్యపేట వస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య కారు ఆపి హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను తమ కారులో ఎక్కించుకొని ప్రభుత్వాసుపత్రికి చేర్పించారు. అనంతరం మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

రోడ్లను పరిశుభ్రంగా ఉంచాలి

ప్రజాశక్తి - తిరువూరు : పర్యావరణ పరిరక్షణ ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ రోడ్లపై చెత్త వేయకుండా పరిశుభ్రత పాటించాలని నగర పంచాయతీ వైస్ చైర్ పర్సన్ గుమ్మా వెంకటేశ్వరి అన్నారు. పట్టణ శివారు 12వ వార్డు పిటి కొత్తూరులో స్వచ్ఛతా హిసేవ కార్యక్రమంలో భాగంగా ఆదివారం క్లీన్ ఆంధ్రప్రదేశ్ క్లీన్ ఇండియా కార్యక్రమం నిర్వహించారు. మహిళలు, చిరు వ్యాపారులు రోడ్లపై చెత్త వేయడం వల్ల పర్యావరణానికి హాని కలిగించడమే కాకుండా పట్టణంలో అపరిశుభ్రత వాతావరణం నెలకొంటుందని వెంకటేశ్వరి తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో ఇంటింటికి అందించిన చెత్తబుట్టల్లో తడిపొడి చెత్త వేరువేరుగా శానిటరీ సిబ్బందికి అప్పగించాలన్నారు. రోడ్లపై చెత్త వేసే వారికి పెనాల్టీ విధిస్తామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించి స్వచ్ఛ తిరువూరుకు సహకరించాలని కోరారు. పీటీ కొత్తూరు నుంచి తిరువూరు నగర పంచాయతీ వరకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు అంబటి వెంకటనారాయణ రెడ్డి, గుమ్మా పాపారావు, కుడుముల రంగారెడ్డి, వేమిరెడ్డి సత్యనారాయణరెడ్డి, వేమిరెడ్డి ప్రసాద్ రెడ్డి, సచివాలయ శానిటరీ సెక్రటరీ రమేష్ పాల్గొన్నారు.





రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి - వీరులపాడు : మండలంలోని జుజ్జూరు, చట్టనవరం గ్రామాల మధ్య రోడ్డుకు ఆదివారం మరమ్మతులు చేపట్టారు. రోడ్డుపై పెద్దపెద్ద గోతులు ఏర్పడటంతో టిడిపి నాయకులు గురజాల అజయ్ కుమార్ సొంత ఖర్చులతో మరమ్మతులు చేపట్టారు. సుమారు రూ.50 వేలు ఖర్చుతో రోడ్డు మరమ్మతులు చేశారు. చట్టనవరం గ్రామానికి చెందిన కోట భారత్ కుమార్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు ప్లేట్లు, గ్లాసులు, దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, ఎల్ఐసి విశ్రాంతి ఉద్యోగులు ఆధ్వర్యంలో సంయుక్తంగా కృష్ణానది వరద ప్రభావిత ప్రాంతాల్లో వరద బాధితులకు దుప్పట్లు, ప్లేట్లు, గ్లాసులు అందజేశారు. ఇబ్రహీంపట్నం మండలం పెర్రి, కొటికలపూడి గ్రామాల్లో సుమారు 800 మందికి పేదలు, వృద్ధులు, వికలాంగులకు, వితంతువులు, ఇతర పింఛన్‌దారులకు ప్లేటు గ్లాసు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విశ్రాంతి ఉద్యోగుల అఖిల భారత నాయకులు కె.ఎస్.మూర్తి, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు మాట్లాడుతూ పేదలకు తమ వంతు సహకారాన్ని అందిస్తున్నామని వరద ప్రాంతాల్లో ప్రజలు ఎంతో పోగొట్టుకున్నారన్నారు. ఆ నష్టాన్ని పూడ్చలేమని ఎల్ఐసి రాజమండ్రి వారు శ్రమించి విశ్రాంతి ఉద్యోగులు రాజమండ్రి నుండి విజయవాడ ప్రాంతంలో సామాగ్రిని సమకూర్చి ఈ చిన్న సహకారాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని వారన్నారు. సహకారానికి ముందుకు వచ్చిన ఎల్ఐసి వారికి గ్రామ ప్రజల తరుపున కొటికలపూడి సర్పంచ్ రెంటపల్లి నాగరాజు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎల్ఐసి ఉద్యోగుల సంఘం నాయకురాలు పద్మ శ్రీ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్, సిఐటియు విజయవాడ నగర కార్యదర్శి సుధాకర్, సిఐటియు జిల్లా నాయకులు యం.సోమేశ్వరరావు ఐద్వా నాయకులు రామసీత, డివైఎఫ్ఐ నాయకులు కృష్ణ రాయలు, ప్రముఖ అడ్వకేట్ చింత శ్రీనివాసరావు, అన్నమయ్య చింత వెంకట్, సాయి, నాగ కనకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు



న్యాయమూర్తిని సన్మానిస్తున్న న్యాయవాదులు

న్యాయమూర్తికి సన్మానం

ప్రజాశక్తి - నందిగామ : ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ న్యాయమూర్తి అరుణ సారిక ఆదివారం నందిగామ విచ్చేసిన సందర్భంగా అరుణ సారికను నందిగామ బార్ అసోసియేషన్ అధ్యక్షులు నంద్రు బాబు విద్యాసాగర్, బార్ అసోసియేషన్ కార్యవర్గం, న్యాయవాదులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది యర్రం రెడ్డి బాబూరావు, బార్ సంయుక్త కార్యదర్శి ఎక్కిరాల హనుమంతరావు, పిపి రంగారావు, కాట్రా సత్యనారాయణ, బొందలపాటి రామకృష్ణ, గోపు శ్రావణ్, చిరుమామిళ్ల శ్రీనివాసరావు, బొబ్బిళ్ళ పాటి భాస్కరరావు, కొమ్మినేని మౌళేశ్వరరావు, జిల్లేపల్లి రంగారావు, షేక్ సైదా, ఆనందం విజయ్, రవికుమార్, రామారావు, కన్నాల చరణ్ పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

గుర్రం జాషువా జయంతి

విజయవాడ : శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు మహాకవి గుర్రం జాషువా జయంతి నిర్వహించారు. జాషువా 129వ జయంతి సందర్భంగా గ్రంథాలయ అధికారి కె.రమాదేవి మాట్లాడుతూ గుర్రం జాషువా ఎన్నో సమస్యలను సమాజంలో ఎదుర్కొని ఆ పరిస్థితులను మారాలని గొప్ప గొప్ప రచనలు చేసి గొప్ప కవిగా పేరు తెచ్చుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాఠకులు గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - నందిగామ : ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకెళుతోందని నందిగామ ఎంఎల్ఎ తంగిరాల సౌమ్య అన్నారు. నందిగామ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు ఆదివారం ఎంఎల్ఎ శంకుస్థాపన కార్యక్రమం చేపట్టారు. మండలంలోని చెరువుకొమ్ముపాలెం, కొత్త బెల్లంకొండ వారి పాలెం, పెద్దవరం గ్రామాల్లో ఎన్ఆర్ఇజిఎస్ నిధుల కింద రూ.35 లక్షలతో సిసి రోడ్డు, డ్రైన్ పనులకు శంకుస్థాపన చేశారు. క్రిక్ బయోటెక్ కంపెనీ సహకారంతో కొత్త బెల్లంకొండ వారి పాలెం గ్రామంలో మంచినీటి వాటర్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేశారు. ఎంఎల్ఎ మాట్లాడుతూ వాటర్ ప్లాంట్ ఏర్పాటు నిర్మాణానికి ముందుకొచ్చిన క్రిక్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత ఇసుక అమలేదీ...?

● పనుల్లేక పస్తులుంటున్న కార్మికులు



నిర్మాణ కార్మికులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

ప్రజాశక్తి పెడన : రెక్కాడితేగానీ డొక్కాడని కార్మికుల జీవితాల్లో ఇసుక రూపంలో ఆకలి కేకలు వినిపిస్తున్నాయి. దీంతో పలు రకాల చేతి వృత్తిదారుల పరిస్థితి దయనీయ స్థితికి చేరుకుంది. పెడన నియోజకవర్గంలోని పట్టణ, రూరల్ ప్రాంతాల 1200 మంది మేస్త్రిగా, 2700 మంది కూలీలుగా పనిచేస్తున్నట్లు ప్రభుత్వ రికార్డులు చెబుతున్నాయి. గత వైసిపి ప్రభుత్వం వచ్చాక ఇసుక ధరని నిర్ణయించారు. వీటిపై పలు ఆంక్షలు విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వీటి వలన దాదాపు 7 నెలలపాటు భవన నిర్మాణ రంగానికి చెందిన తాపీ, సెంట్రింగ్, రంగులు, వడ్రంగి, కరెంటు రంగాలతో పాటు పలు రంగాలలో పనులు లేక పూర్తిగా నిలిచిపోయాయి. అప్పట్లో ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ భవన నిర్మాణ కార్మికులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా ఎన్నికల తర్వాత లాంగ్ మార్చ్ అంటూ ఓ కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన వెంటనే ఇసుకను ఉచితంగా అందిస్తామని హామీ ఇచ్చారు. అయితే సంబంధిత శాఖ మంత్రి అక్టోబర్ నెల వరకు ఇసుక పంపిణీ జరిగే అవకాశాలు లేవని ప్రకటించడంతో కార్మికుల్లో ఆందోళన నెలకొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు దాటినా నేటికీ ఇసుక ఉచితంగా పంపిణీ జరగక పోవడంతపై కార్మికులు ఆందోళన చెందుతున్నారు. అయితే గత ప్రభుత్వ ధరలకైనా ప్రస్తుతం ఇసుక దొరకడం లేదు. గత ప్రభుత్వంలో ఒక్కో ట్రాక్టర్ 4500 ఉండగా ప్రస్తుతం అదే ట్రక్కు 7000 పలుకుతుంది. అంతేకాకుండా 50 కేజీల పట్టే సిమెంట్ సంచి ఇసుక 120 నుంచి 150కి అమ్ముతున్నారంటే ఉచితం మాటునా ఇసుక ఏ విధంగా దోపిడీ జరుగుతోందో అర్థం చేసుకోవచ్చు. ఈ ధరలతో సామాన్య, మధ్యతరగతి చెందినవారు పనులను నిలిపివేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఇసుక విధానాన్ని ఉచిత ఇసుక విధానాన్ని త్వరలో విడుదల చేయాలని కోరుతున్నారు..

ఉచిత దంత వైద్య శిబిరం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక లయన్స్ సేవా భవనంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత పిల్లల వైద్య శిబిరం, దంత వైద్య శిబిరాన్ని క్లబ్ అధ్యక్షురాలు నిమ్మగడ్డ శశికళ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిబిరంలో 45 మంది పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేశారు. అలాగే 40 మంది కి దంత వైద్యపరీక్షలు నిర్వహించి ఉచిత మందులు అందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ సభ్యులు వైపిసి ప్రసాద్, ఎస్ పరం మామయ్య, సిహెచ్ బాలాజీ, రాజా, నవాబు,సుధాకర్, పెరుమల్లు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఈక్రాఫ్ చేయించుకుంటున్న రైతులు

రైతులు ఈక్రాప్ చేయించుకోవాలి

ప్రజాశక్తి-పమిడిముక్కల : ప్రతి రైతు తమ పంటలను ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని, ఈక్రాఫ్ చేసుకునేందుకు ఈనెల 30వ తేదీ ఆఖరు తేదీ అని మండల వ్యవసాయ అధికారి గణేష్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని వీరంకులాకులులో ఈక్రాఫ్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట నష్టం, బీమా యోజన పథకాలు రావాలంటే తప్పక రైతులు ఈక్రాఫ్ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన సిఐటియు అన్నదాన కేంద్రాలు

● వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం: ఎన్‌సిహెచ్ శ్రీనివాస్



అన్నదానం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-విజయవాడ : సిఐటియు రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో విజయవాడ నగరంలో నిర్వహిస్తున్న అన్నదానం కేంద్రాలు ఆదివారంతో ముగిశాయి. నాలుగు రోజుల పాటు సాగిన ఈ కేంద్రాల ద్వారా వేలాది మందికి భోజనం వసతి కల్పించారు. పాత రాజరాజేశ్వరీపేట, డాబాకొట్లు సెంటర్, ఎల్‌బిఎస్ నగర్ ఏరియాల్లో నిర్వహించిన ఈ కేంద్రాల ద్వారా వరద బాధితులకు పెద్ద ఎత్తున భోజనం ఏర్పాట్లు కల్పించారు. వేడివేడి అన్నంతోపాటు రుచికరమైన కూరలతో పేదలను ఆదుకున్నారు. ఒక్కొక్క కేంద్రం వద్ద రోజుకు వెయ్యి నుంచి 1200 మంది వరకు భోజనం చేశారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ నర్సింగ్‌రావు తొలుత కేంద్రాలను ప్రారంభించగా, రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, ఇతర రాష్ట్రనాయకులు, జిల్లా నాయకులు, స్థానిక నాయకులు , కార్యకర్తలు పాల్గొని వరద బాధితులకు భోజన వసతి కల్పించారు. రెండు పూటలా భోజనం వడ్డించారు. ఆదివారం పాత రాజరాజేశ్వరీపేట, డాబాకొట్టు సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో అన్నదానం పెద్ద ఎత్తున జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ అన్నదానం కేంద్రాలు ఏర్పాటు చేయడం ద్వారా వరద బాధితులకు ఎంతో ఆసరాగా ఉందన్నారు. ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్న బాధిత ప్రజలకు ఈ కేంద్రాలు ఎంతో ఉపయోగపడ్డాయని అన్నారు. అటు వరద బాధితులను అయా రూపాల్లో ఆదుకోవడంతో పాటు భోజనం ఏర్పాటు చేసి, ప్రజల ఆకలి తీర్చడం జరిగిందన్నారు. సిఐటియు పోరాటాలే కాకుండా ప్రజలు బాధల్లో, ఇబ్బందుల్లో ఉన్నప్పుడు వారికి అండగా నిలవడానికి వీటిని ఏర్పాటు చేశామన్నారు. అనేక మంది కార్మికవర్గం ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందించిన కారణంగా ఈ కేంద్రాలను నిర్వహించామన్నారు. విజయవాడ సిటీతో పాటు కొండపల్లి, ఇబ్రహీంపట్నం, దొనబండ తదితర ఏరియాల్లో అన్నదాన కేంద్రాలను సిఐటియు నిర్వహిస్తుందన్నారు. ప్రభుత్వం ఇప్పటికయినా వరద బాధితులను అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు బోయి సత్యబాబు, ఇవి నారాయణ, సిఐటియు సెంట్రల్ సిటీ అధ్యక్షులు కె దుర్గారావు, ముఠా వర్కర్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి ఎం సీతారాములు, పౌరసంక్షేమ సంఘం జిల్లా నాయకులు భూపతి రమణారావు, నాయకులు సిహెచ్ శ్రీనివాస్, ఎస్‌కె పీరు, టి ప్రవీణ్, ఎస్‌కె నిజాముద్దీన్, ఎస్ అప్పన్న, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

యుటిఎఫ్ ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్ : యూటీఎఫ్ ఏలూరు జిల్లా శాఖ సహకారంతో బుడమేరు వరదభాదితులకు దుప్పట్లు, చీర , లుంగి టవలు, వంటి దుస్తులను కొత్తపేట 2 టౌన్ లో గల మోటూరు హనుమంత్ రావు శ్రామిక భవన్ లో పంపిణీ చేసినట్టు యుటిఎఫ్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కే శ్రీనివాసరావు, సుందరయ్యలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి యస్ పి మనోహర్ కుమార్ మాట్లాడుతూ యుటిఎఫ్ గడిచిన 50 ఏళ్లలో అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ ఉపాధ్యాయుల మన్ననలతో పాటు అనేకమంది పేద ప్రజానీకం మద్దతు కూడా కూడకట్టుకున్నదని అన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి మాట్లాడుతూ యుటిఎఫ్ వరదల సమయంలో వాటిని సైతం లెక్కచేయకుండా అనేక మారుమూల ప్రాంతాలకు వెళ్లి ఫుడ్, కొవ్వొత్తులు, బట్టలు పంపిణీ చేయడం వంటివి అభినందనీయమని అన్నారు. ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. రవి కుమార్ మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణా జిల్లా లో కొల్లేరు ప్రాంతం లో కూడా ఏలూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో దుస్తులు, నిత్యావసరాలు పంపిణీ చేసినట్టు తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షుల కె శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ సుందరయ్య, ఏలూరు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్య దర్శులు ముస్తఫా ఆలి, ఆర్.రవికుమార్,ఏలూరు జిల్లా కార్యదర్శి యస్.సుధారాణి , ఎన్టీఆర్ జిల్లా కోశాధికారి పి. నాగేశ్వరరావు, జిల్లా ఆడిట్ కమిటి కన్వీనర్ ఏ.గోపాల కష్ణ ,విజయవాడ సిటీ నాయకులు జగన్ , సుబ్బా రెడ్డి పాల్గొన్నారు.

నేడు గుడివాడలో వేడుకలు

ప్రజాశక్తి - గుడివాడ : అంబేద్కర్ ఆశయమైన రాజ్యాధికారం సాధించేందుకు దళితులు ఐక్యంగా ఉండాలని ఆదిమాంధ్ర సంఘం జిల్లా అధ్యక్షుడు పొంగులేటి జయరాజు అన్నారు. ఆదివారం స్థానిక రాజేంద్రనగర్‌లోని అంబేద్కర్ మెమోరియల్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీ నాటికి బాబాసాహెబ్ డా.బి.ఆర్ అంబేద్కర్ గుడివాడలో పర్య టించి 78 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వేడుకలు నిర్వహి స్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ పాల్గొనాలని జయరాజు పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి బొడ్డు విల్సన్‌బాబు, బెజ్జం సువర్ణరాజు, దోనే కోటిబాబు, సాదే విజయ్, శంకరంపాడు సర్పంచ్ కైలే సుబ్బారావు పాల్గొన్నారు.

బుద్ధవరం రోడ్డులో ఆక్రమణలు

ప్రజాశక్తి-గన్నవరం : బుద్ధవరం రోడ్డులో జరుగుతున్న అక్రమ కట్టడాలు.. ఆక్రమణలను తొలగించేందుకు అధికారులు ఏ విధమైన చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ఆక్రమణదారులు రెచ్చిపోయి రోడ్డును సైతం ఆక్రమించి కట్టడాలు నిర్మిస్తున్నారు. జాతీయ రహదారి నుండి ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లే రోడ్డు ఇరువైపులా ఆక్రమణలు పెరిగాయి. ఎవరికి వారు పంచాయతీ డ్రైనేజీ తోపాటు రోడ్డు స్థలాన్ని కూడా ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారు. ముఖ్యంగా సి ఆర్ డి ఏ అనుమతులు లేకుండా మూడు అంతస్తుల భవనాలు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించేసి ఈ నిర్మాణాలు కడుతున్నారు. ఆక్రమణలతో రోడ్డు రెండు పక్కల తగ్గిపోతుందని, కనీసం రెండు కార్లు తప్పుకోవడానికి కూడా వెళ్లలేదు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి పెద్ద భవనాలు కడుతున్నా స్థానిక అధికారులు పట్టించుకోవడం లేదు. భవిష్యత్తులో ఈ రోడ్డు విస్తరణ చేసి మండల పరిషత్ కార్యాలయం వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదన ఉన్నట్లు తెలిసింది. అయితే ఆక్రమణలో, అక్రమ కట్టడాల తో రోడ్డు విస్తరణ తగ్గిపోతుందని, దీనిపై ఉన్నతాధికారులు రంగంలోకి దిగి రోడ్డు సర్వే చేయించి ఆక్రమణలను తొలగించాలని, అక్రమ కట్టడాలు నిర్మూలించాలని, అనుమతులు లేని కట్టడాలపై సీఆర్డీఏ అధికారులు రంగంలోకి దిగాలని స్థానికులు కోరుతున్నారు.

రసాభాసగా సర్వసభ్య సమావేశం

ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహ నిర్మాణ సంఘం వార్షికోత్సవ సమావేశంలో బాధితుల ఆందోళన



ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం మండలం కేతన కొండ శ్రీహరిపురం కాలనీ లే అవుట్ కేంద్రంగా ఆదివారం మరోసారి గందరగోళ వాతావరణం నెలకొంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహ నిర్మాణ సంఘం లిమిటెడ్ సంఘంగా ఏర్పడి ఉద్యోగులు కొనుగోలు చేసిన భూముల వ్యవహారంలో సొసైటీ పెద్దల వ్యవహార శైలి మోసపూరితంగా ఉందంటూ కొంద మంది సభ్యుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహ నిర్మాణ సంఘం లిమిటెడ్ 8 వార్షికోత్సవ సర్వసభ్య సమావేశం కేతన కొండలో బాధితుల ఆందోళన మధ్య రసాభాసగా సాగింది. సొసైటీని నమ్మి మోసపోయా మంటూ బాధితుల ఆందోళనకు దిగారు. దీంతో కొద్ది సేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది. మధ్యాహ్నం 2.30 కి సమావేశం అని చెప్పి ముందే దొంగచాటుగా సమావేశం నిర్వహించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కోరం లేకుండా సమావేశం నిర్వహించడంపై సభ్యులు ఆందోళన దిగారు. 655 సభ్యులు ఉండగా 200 మంది మాత్రమే సమావేశానికి హాజరవడంపై సభ్యుల ఆందోళన వ్యక్తం చేశారు. అక్టోబర్ 10న సొసైటీ సమావేశం గుంటుపల్లిలో నిర్వహించారు. అప్పుడు కూడా సొసైటీకి సంబంధించి కోరం లేకపోవడంతో వాయిదా పడింది. ఆదివారం జరిగిన సమావేశం కూడా అదే పరిస్థితి నెలకొనడంతో సభ్యుల మధ్య రసాభాస చోటుచేసుకుంది. గతంలో 29 మందిని సభ్యత్వం నుండి తొలగించారు. అనేక అవకతవకలు జరిగినట్లు అందులో ఉన్న సభ్యులే తెలపటంతో సొసైటీ పాలకవర్గం రోడ్డున పడింది. కోరం లేకుండానే మీటింగ్ నిర్వహించడంపై సభ్యులు ఆందోళన చేయటంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. ప్రతినెల గజానికి రూ.10 చోప్పున అదనపు డబ్బులు వసూలు చేస్తున్నారని బాధితులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే లక్షలు కట్టి మోసపోయామని, ఇంకా అదనంగా డబ్బులు ఎక్కడి నుంచి కట్టాలని ఆవేదన చెందుతున్నారు. మార్ట్ గేజి భూములు కూడా అక్రమంగా అమ్మేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. సొసైటీ అధ్యక్షులు అడ్డాల సుబ్బరాజుపై బాధితులు మండిపడుతున్నారు. పోలీసులు రంగ ప్రవేశం చేయటంతో సభ్యులు సమావేశాన్ని నిలిపివేయాలని కోరారు. గతంలో అనేక అవకతవకలు జరిగాయని ముందు వాటిపై చర్యలు తీసుకొని, సమావేశం నిర్వహించాలని సొసైటీ సభ్యులు కోరారు.

90 శాతం లబ్ధిదారులకు ఆర్థిక సహాయం జమ

- లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో సమస్యల వల్ల మిగిలిన 10 శాతం పెండింగ్
- లబ్ధిదారులు వెంటనే బ్యాంకు ఖాతాలను సరిచేసుకోవాలి : కలెక్టర్ సృజన

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ముంపు ప్రభావంతో నష్టపోయిన ప్రతి కుటుంబానికీ ప్రభుత్వం పరంగా ఆర్థిక సహాయం అందుతోందని ఇప్పటికే 90శాతం మేర లబ్ధిదారులకు పరిహారం వారి బ్యాంకు ఖాతాల్లో జమైందని మిగిలిన 10 శాతం కూడా బ్యాంకు ఖాతాల్లో సమస్యల వల్ల పెండింగ్లో ఉందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. వరద ప్రభావంతో ముంపునకు గురైన ఇళ్లకు సంబంధించి 75,427 కుటుంబాల ఖాతాల్లో దాదాపు రూ.160.47 కోట్ల మేర నగదు జమచేయడం జరిగిందన్నారు. 4,315 కుటుంబాలకు సంబంధించి బ్యాంకు ఖాతాల సమస్యలు ఉత్పన్నమయ్యాయని మరో 8 వేల కుటుంబాలకు సోమవారం డీబీటీ ద్వారా ఖాతాల్లో ఆర్థిక సహాయం జమకానుందని తెలిపారు. త్రిచక్ర వాహనాల నష్టాలకు సంబంధించి 3,149 మందికి, ద్విచక్రవాహనాలకు 30,722 మందికి, తోపుడుబళ్లకు 431 మందికి విజయవంతంగా వారి ఖాతాల్లో పరిహారం జమైనట్లు తెలిపారు. ఇళ్ళ, త్రిచక్ర, ద్విచక్ర, తోపుడుబండ్లకు సంబంధించి మొత్తంమీద ఇప్పటివరకు 1,09,729 ఖాతాలకు దాదాపు రూ.173.69 కోట్ల మేర సొమ్ము జమ చేసినట్లు వివరించారు. బ్యాంకు ఖాతాల సమస్యలున్న కేసులను క్షుణ్ణంగా పరిశీలించి, లబ్ధిదారులకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. బ్యాంకు ఖాతాల్లో సమస్యలు ఉన్నవారు తమ బ్యాంకు ఖాతాలను సరిచూసుకోవాలని, సత్వరం బ్యాంకును సంప్రదించి ఆధార్‌తో బ్యాంకు ఖాతాను లింక్ చేసుకోవాలని సూచించారు. ఈ విషయంలో విజయవాడ నగరపాలక



సంస్థ అధికారులు సహాయం అందిస్తారని వివరించారు. బ్యాంకు ఖాతా వివరాలు సరైన విధంగా నమోదు చేసుకుంటే సోమవారం సాయంత్రంలోగానే జమ చేయడం జరుగుతుందన్నారు. ఏ ఒక్కరూ ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని నష్టపోయిన ప్రతికుటుంబానికి ఆర్థిక సహాయం తప్పనిసరిగా అందుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ ఒక్క బాధిత కుటుంబానికి పరిహారం అందకుండా మిగిలిపోకూడదనే లక్ష్యంతోనే పకడ్బందీ చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ సృజన తెలిపారు. ఆర్థిక సహకారానికి సంబంధించిన ప్రతి అర్జీని పరిశీలించి, పరిహారం అందించడం జరుగుతుందని తెలిపారు.

రేపు జెవివి చెకుముకి సైన్స్ సంబరాలు



ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : 34 సంవత్సరాలుగా జన విజ్ఞాన వేదిక రాష్ట్రస్థాయిలో విద్యార్థులలో సైన్స్ పట్ల అభిరుచిని పెంచడానికి తోడ్పడేలా చెకుముకి సైన్స్ సంబరాలను నిర్వహిస్తుంది. ఇందులో భాగంగా కొండపల్లి పట్టణ జన విజ్ఞాన వేదిక కమిటీ ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాలు సందర్భంగా ఇబ్రహీంపట్నం మండలంలోని 11 ప్రైవేట్ పాఠశాలల్లో ఐదు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 8, 9, 10 తరగతి విద్యార్థులు సెప్టెంబర్ 25న పాఠశాల స్థాయి చెకుముకి సైన్స్ పరీక్షలు ఆయా పాఠశాలల నిర్వహణలో తెలుగు మీడియం, ఇంగ్లీష్ మీడియంలో జరిగాయి. పాఠశాల స్థాయి పరీక్షల్లో 1,400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాల స్థాయిలో 8, 9, 10వ తరగతిలో ప్రథమస్థానం పొందిన విద్యార్థులు మండల స్థాయి పోటీలకు అర్హత సాధించారు. 11 ప్రైవేటు 5 ప్రభుత్వ పాఠశాలల నుండి 48 మంది విద్యార్థులు మండల స్థాయి పోటీలకు అర్హత సాధించారు. మండల స్థాయి పోటీలు ఇబ్రహీంపట్నంలోని డాక్టర్ జాకీర్ హుస్సేన్ కళాశాలలో అక్టోబర్ 1న నిర్వహించనున్నట్లు కొండపల్లి జన విజ్ఞాన వేదిక కమిటీ తెలిపింది. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులను సకాలంలో హాజరయ్యేలా చూడాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులను జెవివి సభ్యులు కోరారు. పరీక్షల అనంతరం జరిగే సభలో చెకుముకి పరీక్షల్లో పాఠశాల స్థాయిలో ప్రథమ స్థానం పొందిన విద్యార్థులకు, మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానం పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేయడం జరుగుతుందని తెలిపారు.

నలందలో ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : విద్యార్థులు చదువుతో పాటు కళలు, క్రీడలు, సాహిత్య రంగాల్లో కూడా రాణించాలని కృష్ణా విశ్వ విద్యాలయం డైరెక్టర్ ప్రొఫెసర్ ఎంవి.బసవేశ్వరరావు అన్నారు. చదువుతో పాటు ఆసక్తి ఉన్న రంగాన్ని ఎంచుకొని అందులో కూడా ప్రతిభ చాటాలన్నారు. జీవితంలో ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని, లక్ష్య సాధన కోసం నిరంతరం కృషి చేయాలన్నారు. నిబద్ధత, పట్టుదల, లక్ష్యం ఉంటే జీవితంలో ఏదైనా సాధించగలమని అన్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నలంద డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలుగు, హిందీ, మలయాళం సినిమా పాటలకు స్టెప్పులు వేస్తూ ఉర్రూతలూగించారు. సాంప్రదాయ, ఆధునిక, పాశ్చాత్య వస్త్రధారణలో విద్యార్థులు ప్రదర్శించిన ఫాషన్ షో ఆకట్టుకుంది. సంగీతానికి అనుగుణంగా, లయబద్ధంగా ర్యాంప్ పై క్యాట్ వాక్ చేస్తూ అలరించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన కృష్ణా విశ్వ విద్యాలయం డైరెక్టర్ ప్రొఫెసర్ ఎంవి.బసవేశ్వరరావు, కళాశాల కరెస్పాండంట్ విజయ్ బాబు మాట్లాడుతూ నలంద డిగ్రీ కళాశాల విద్యార్థుల భవిష్యత్తుకు మంచి మార్గాన్ని చూపుతుందనే ఉద్దేశంతో విద్యార్థులు తమ కళాశాలలో చేరడం జరిగిందన్నారు. వారి నమ్మకానికి పూర్తి నిదర్శనం, ఈ సంవత్సరం డిగ్రీ అడ్మిషన్లేనని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ మాట్లాడుతూ సాంస్కృతిక కార్యక్రమాలతో కళాశాల సాధించిన లక్ష్యాలను తెలియజేయడం జరిగిందన్నారు. అకాడెమిక్స్‌లో టాపర్‌లకు, వరద సహాయక చర్యల్లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్‌లు అందజేశామన్నారు.



కీర్తిలాల్స్ డైరెక్టర్‌కు అవార్డు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : కీర్తిలాల్స్ డైరెక్టర్ సూరజ్ శాంతకుమార్‌కి ఐకాన్ ఆఫ్ ది జ్యువెలరీ ఇండస్ట్రీ 2024 అవార్డు లభించింది. నేషనల్ జ్యువెలరీ అవార్డ్స్ 2024లో ఆల్ ఇండియా జెమ్ అండ్ జ్యువెలరీ డొమెస్టిక్ కౌన్సిల్ (జిజెసి)ఈ అవార్డును ప్రధానం చేసింది. ఎం.జీ.రోడ్డులోని షోరూంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ శాంత కుమార్ వ రా ట్లా డ ు తూ రా ఇండియా జెమ్ అండ్ జ్యువెలరీ షో (జీజెఎస్) కార్యక్రమంలో ఈ అవార్డు అందుకున్నట్లు తెలిపారు. ఆభరణాల పరిశ్రమకు అందించిన విశేషమైన సేవలకు గుర్తింపుగా, డిజైన్, నవ్యావిష్కరణ, వ్యాపార నాయకత్వాల్లో శ్రేష్ఠమైన నైపుణ్యాలకు ఈ పురస్కారం అందజేసినట్టు నిర్వాహకులు తెలిపారు. దీంతో పాటు స్టోర్ ఆఫ్ ది ఇయర్ (సౌత్), రింగ్ ఆఫ్ ది ఇయర్, థీమ్ బేస్డ్ జ్యువెలరీ, బ్రైడల్ జ్యువెలరీ ఆఫ్ ది ఇయర్ (కలర్ స్టోన్) నాలుగు విభాగాల్లో కూడా కీర్తిలాల్స్ పురస్కారాలను పొందిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీజేసీ డైరెక్టర్లు అశోక్ కుమార్ జైన్, సమర్ కుమార్ డిఇ, సాహిల్ మెహరా, ఆసీస్ కొహారీతో పాటు జ్యువెల్ ట్రెండ్స్ డైరెక్టర్ గోవింద్ వెర్మ పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న శాంతకుమార్

సామాజిక చైతన్యానికి కృషి చేసిన సుంకర : మధు



ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : టోల్‌ప్లాజాలు, డీజిల్ అధిక ధరలు తదితర ప్రభుత్వ విధానాలతో లారీ యజమానులు శ్రమదోపిడీకి గురవుతున్నారని, మరోవైపు బడా పారిశ్రామికవేత్తలు బలపడుతున్నారని, వామపక్షభావాలు, సంఘసంస్కరణ బీజాలు కలిగిన సుంకర రమేష్ బాబు లాంటి వ్యక్తులు ప్రభుత్వాలను ప్రశ్నిస్తూ ప్రజల్లో సామాజిక చైతన్యానికి చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుందని సిపిఎం రాజ్యసభ మాజీసభ్యులు పి.మధు అన్నారు. ఆదివారం విజయవాడలోని లారీఓనర్స్ హాలులో కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి, లారీ ఓనర్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ స్టోర్స్ కార్యదర్శి, లారీ ఓనర్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి, మోటార్ ట్రాన్స్ పోర్ట్ మాసపత్రిక మాజీ ప్రధాన సంపాదకులు సుంకర రమేష్ బాబు సంస్మరణసభలో పి.మధు మాట్లాడారు. నగర అభివృద్ధిలో లారీ యజమానులు, ఆటోనగర్ పారిశ్రామికవాడ పాత్ర మరువలేనిదన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ ఎస్.ఎఫ్.ఐ. ద్వారా రమేష్ బాబు విద్యార్థి ఉద్యమాన్ని నడిపించారని, తరవాత లారీ యజమానులను సంఘటితం చేశారని నివాళి అర్పించారు., ఎం.బి. భవన్ కార్యదర్శి మురళీకృష్ణ మాట్లాడుతూ చమురుపై ఎక్సైజ్ సుంకాన్ని ఎత్తివేసి సెస్సు విధించడం కేంద్ర ప్రభుత్వకుట్రగా ఆరోపించారు. సిపిఎం నాయకులు వైవి రావు మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారానికి ఐక్యత అవసరమన్నారు. సి.పి.ఎం. నాయకులు మురహరి, దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ లారీ యజమానుల సంఘపెద్దలు రామశేషయ్య, కేశవరావు, జితేంద్రనాథ్ తదితరులు వామపక్షభావాలు కలిగినవారన్నారు. రాష్ట్ర రైతు సమాఖ్య అధ్యక్షులు వై కేశవరావు మాట్లాడుతూ గతంలో లారీల సమ్మె జరిగినప్పుడు మామిడి రైతులు నష్టపోకూడదని రమేష్ బాబు తపించారన్నారు. ఆంధ్రప్రదేశ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.వి.ఈశ్వరరావు సభను నిర్వహించారు. అసోసియేషన్ స్వర్ణోత్సవాల నిర్వహణలో, సావనీర్ రూపకల్పనలో రమేష్ బాబు చేసిన కషిని కష్ణాడిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నాగుమోతు రాజా కొనియాడారు. సొసైటీ అధ్యక్షులు కె.వి. రమేష్, ఫౌండేషన్ అధ్యక్షులు రావి గోపాలరావు, మాజీ ప్రధాన కార్యదర్శి చెన్నుపాటి వజీర్ తదితరులు సుంకర రమేష్ బాబుకు నివాళులర్పించారు.

వరల్డ్ హార్ట్ డే సందర్భంగా వాక్‌థాన్



ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : ఆరోగ్యకరమైన హృదయంతో ఆనందకరమైన జీవితం సాధ్యమవుతుందని డీసీపీ ఎం. కష్ణమూర్తి నాయుడు అన్నారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా, కార్డియలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ఏపీ చాప్టర్ నిర్వహించిన వాక్ ఫర్ హార్ట్.. లవ్ యు ఆంధ్రప్రదేశ్.. 5కె వాకథాన్ కార్యక్రమాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. బీఆర్టీఎస్ రోడ్డు శ్రీ శారదా కళాశాల వద్ద ఆదివారం జరిగిన ఈ కార్యక్రమానికి డీసీపీ కష్ణమూర్తి నాయుడు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గుండె సంరక్షణ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగివుండాలని ఆయన సూచించారు. హదయ సంబంధ వ్యాధులు, గుండె ఆరోగ్య పరిరక్షణ గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు కార్డియలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ఏపీ చాప్టర్ వారికి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ హద్రోగ వైద్య నిపుణుడు డాక్టర్ పి. రమేష్ బాబు మాట్లాడుతూ, హదయ సంరక్షణ కోసం సమతుల ఆహారం, సక్రమమైన జీవన విధానం, తగినంత శారీరక శ్రమ తప్పనిసరి అని అన్నారు. మధుమేహం, అధిక రక్తపోటు వంటి సమస్యలున్న వారు, వాటిని అదుపులో ఉంచుకోవాలని తెలిపారు. కార్డియలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ఏపీ చాప్టర్ ట్రెజరర్ డాక్టర్ ఎ. పూర్ణానంద్, శ్రీ శారదా కళాశాల వద్ద ప్రారంభమైన ఈ 5కె వాకథాన్.. గుండె సంరక్షణ పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తూ బీఆర్టీఎస్ రోడ్డులో కోలాహలంగా సాగింది. ఈ కార్యక్రమంలో కార్డియలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ఏపీ చాప్టర్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ జె. శ్రీమన్నారాయణ, వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ చిన్నం రామకష్ణ, పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది, వైద్య విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు, వాకర్స్ ఇంటర్నేషనల్ సభ్యులు, అనేక మంది నగర పౌరులు పాల్గొన్నారు.

ఊపిరితిత్తుల వ్యాధులకు అత్యాధునిక వైద్యం

మణిపాల్ హాస్పటల్స్ ఆధ్వర్యంలో లంగ్ మ్యాట్రిక్స్‌పై సదస్సు



ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : వైద్య రంగంలో అత్యంత వేగంఆ అభివృద్ధి చెందుతున్న వాటిల్లో పల్మనాలజీ, రుమటాలజీ, అంటువ్యాధులు చాలా ముఖ్యమైనవని వైద్య విధానంలో వచ్చిన అత్యాధునిక మార్పుల వలన వ్యాధుల రోగుల జీవితాలు మెరుగుపడ్డాయని పలువురు వక్తలు అన్నారు. మణిపాల్ హాస్పటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని హెూటల్ నోవాటెల్‌లో 'లంగ్ మ్యాట్రిక్స్' అనే అంశంపై వైద్య సదస్సు జరిగింది. తొలుత ఈసదస్సును కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోజు రోజుకూ వైద్య రంగంలో ఎన్నో మార్పులు వస్తున్నాయని, వాటి కారణంగా ఎంతో క్లిష్టమైన అనారోగ్య సమస్యలనుకూడా సులభంగా చికిత్స అందించవచ్చని తెలిపారు. మణిపాల్ హాస్పటల్ పల్మనాలజిస్టు డాక్టర్ లోకేష్ గుప్త మాట్లాడుతూ ఊపిరితిత్తుల వ్యాధులలో ముఖ్యంగా కోవిడ్ -19 అనంతరం వచ్చిన సమస్యలపై ఈసదస్సులో సీనియర్ వైద్యులు చర్చించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి సుమారు 400 మంది వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో మణిపాల్ హాస్పటల్స్ క్లస్టర్ హెడ్ డాక్టర్ సుధాకర్ కంటిపూడి, ఎండోక్రైనాలజిస్టు డాక్టర్ భాను ప్రవీణ్ నాయుడు, డాక్టర్ నేహా, డాక్టర్ పవన్ కుమార్ రెడ్డి, డాక్టర్ కావ్యాదేవి తదితరులు పాల్గొన్నారు.